గిరి పుత్రికల నృత్య నీరాజనం

కృష్ణా జలాలకు స్వాగతం పలుకుతూ దోర్నాల హెచ్ రెగ్యులేటర్ వద్ద 1,500 మంది గిరిజన విద్యార్థినులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దోర్నాల గిరిజన పాఠశాలలకు చెందిన 438 మంది, పుల్లలచెరువు, యర్రగొండపాలెం, త్రిపురాంతకం తదితర ప్రాంతాల నుంచి 312 మంది, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, పల్నాడు తదితర జిల్లాల్లోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలకు చెందిన 750 మంది బాలికలు ఈ వేడుకలో భాగస్వాములయ్యారు. వరానికి అనుగుణంగా పాదాలు కదుపుతూ తమ ప్రత్యేకతను చాటుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వీరి నృత్యానికి ముగ్ధులై ప్రత్యేకంగా అభినందించారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. ప్రాజెక్టు వద్దకు తరలి వచ్చిన ప్రజలు కూడా వీరి నృత్యాన్ని ఆస్వాదించారు. బాలికల ప్రతిభను ప్రతిఒక్కరు ప్రశంసించారు.

"మార్కాపురం అన్నపూర్ణుల్. మీ కోరిక మేరకు జిల్లా ఇచ్చాం. మీ చిరకాల స్వప్నం వెలిగొండను సాకారం చేశాం.ఇక జిల్లా అభివృద్ధికి తిరుగులేదు."

"వెలిగొండ అంటే కరవుపై గెలవాలనే సంకల్పం, మూడు దశాబ్దాల పోరాటం, రైతు భవిష్యత్తుకు నమ్మకం"

"వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు, కరవు నేలపై కృష్ణమ్మ రాసిన చరిత్ర ఇది."

"వెలిగొండ బంగారు కొండ అవుతుంది ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుంది."

"శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయలుదేరిన కృష్ణమ్మ..మార్కాపురం చెన్నకేశవుడు కొలువైన నేలకు జలహారతి ఇస్తుంది."

- వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

జల కల సాకారం.. నవ శకానికి శ్రీకారం

- కరవు నేలను ముద్దాడిన కృష్ణమ్మ
- వెలిగొండ జలాలను చూసి పరవశించిన జనం
- ప్రజలను ఉత్తేజపరుస్తూ సాగిన సీఎం ప్రసంగం

ఐక్యతారాగం... ప్రగతి నినాదం

వేదికపై సంఘీభావం తెలుపుతున్న సీఎం, ప్రజాప్రతినిధులు

ఈ క్షణం.. ఆనంద వీక్షణం

సీఎంను చూసిన ఆనందంలో వీడియోలు తీస్తున్న జనం

మోడు వారిన ఆశలు
మళ్లీ చిగురించాయి
బీడు వారిన భూమి
పంట పండుతానంటోంది
కంఠం దిగని గరళ జలం
కాళ్లకు కట్టేసిన ఫ్లోరైడ్ భూతం
ఇక సెలవు చెప్పనున్నాయి
అసాధ్యమనుకున్న కల
సుసాధ్యమైన వేళ
కరవు నేలను కృష్ణమ్మ
ముద్దాడిన సమయాన..
దశాబ్దాలుగా ఈ క్షణం కోసం
ఎదురు చూసిన ఆ రైతన్నల
కళ్లు చెమర్చాయి..
ఆనంద బాష్పాలు రాల్చాయి!!

– న్యూస్‌టుడే, బృందం

దశాబ్దాల కలగా ఉన్న వెలిగొండ ప్రాజెక్టు కళ్ల ముందు సాకారం కావడంతో మార్కాపురం జిల్లా వాసుల ఆనందానికి అవధులే లేవు. సోమవారం దోర్నాల మండలం గంటవానిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరైన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభకు పలు గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. మహిళలు, చిన్నా పెద్దా తేడా లేకుండా భారీగా హాజరయ్యారు. సీఎం వెళ్లే వరకు కూడా ఉండి వీక్షించారు. కృష్ణా జలాలు తమ ప్రాంతంలో పరవళ్లు తొక్కడం చూసి పరవశించిపోయారు. ప్రతిఒక్కరూ ఆ నీటి గలగలలు చూసి తన్మయత్వానికి లోనయ్యారు. సీఎం చంద్రబాబు జలహారతి ఇచ్చిన తరువాత భావోద్వేగంతో లోపల కృష్ణమ్మ తల్లికి సాష్టాంగ ప్రణామం చేశారు.

వెలిగొండ ప్రాజెక్టు చూద్దామనే భావనతో చాలామంది స్వచ్ఛందంగా వచ్చారు. గ్రామాలకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినా సరిపోక వాటి పైభాగానకెక్కి ప్రయాణించారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతరత్రా వాహనాల్లో తరలివచ్చారు. గంటవానిపల్లెలో శిబిరం ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి పొలాల నుంచి, గట్ల నుంచి, ఎటుచూసినా జనాలు కనిపించారు. ఫీడర్ కాలువ ఒడ్డున ముఖ్యమంత్రి సందర్శనతో నిండిపోయింది. వచ్చినవారంతా సెల్ఫీలు దిగారు. సీఎం వెళ్లిన తరువాత సాయంత్రం ఆరు గంటల వరకు సందర్శకుల తాకిడి కాలువ వద్ద కొనసాగింది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీఎం పర్యటన సజావుగా సాగడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

ఎటు చూసినా జన సందోహం

రెండో దశ పూర్తయితే ఇక్కడే పుష్కరాలు

సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో వెలిగొండ ప్రాజెక్టుతో ఈ ప్రాంత రూపురేఖలు ఎలా మార్పు చెందుతుందనేది ప్రస్తావించారు. పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి ఎదురే లేదు.. అని చెబుతూ [illegible] అంటూ సభికులను ఉత్సాహపరిచారు. ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుందంటూ వివరించారు. వెలిగొండ రెండో దశ పూర్తయితే, కృష్ణా తీరానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే మార్కాపురంలోనే పుష్కరాలు జరుపుకోవచ్చని చెప్పారు. తక్కువ సమయంలో ప్రాజెక్టు పనులు పూర్తిచేసిన మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయసునీత, జేసీ శ్రీనివాసులు, ప్రాజెక్టు ఈఈ కృష్ణారెడ్డి, డీఈ రామస్వామి, ఇంజినీరింగ్ సిబ్బంది, మేఘా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులకు సీఎం చంద్రబాబు ప్రశంసా పత్రాలు అందజేశారు.

పర్యటన సాగిందిలా...

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ముందుగా నిర్ణయించిన సమయం కంటే గంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం 11.11 గంటలకు హెలికాప్టర్‌లో గంటవానిపల్లెలోని ఫీడర్ కాలువకు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేష్, నారాయణ, అనగాని సత్యప్రసాద్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, దామచర్ల జనార్దన్, విజయ్‌కుమార్, కాకర్ల సురేష్, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల బాధ్యులు ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య ఇతర ముఖ్య నాయకులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో క్రాస్ రెగ్యులేటర్ వద్దకు చేరుకున్నారు. నీటి విడుదల, పూజలు, శిలాఫలకం ఆవిష్కరణ అనంతరం... 12.16 గంటలకు సభా వేదికపైకి చేరుకున్నారు. మధ్యాహ్నం 2.34 గంటలకు తిరిగి అమరావతి బయలుదేరి వెళ్లారు.

అమ్మా.. అందుకో

కృష్ణా జలాలకు సారె సమర్పిస్తున్న ముఖ్యమంత్రి, చిత్రంలో మంత్రి నిమ్మల

దారులన్నీ వెలిగొండ వైపే...

ప్రాజెక్టు వద్దకు తరలివస్తున్న ప్రజలు

మాట ఇచ్చాం.. నీళ్లు తెచ్చాం



ఫీడర్ కాలువలో పారుతున్న నీటిని చూపుతున్న ముఖ్యమంత్రి

నీరొచ్చెనంట... వెలుగులు తెచ్చెనంట

పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు జలాలు ఇప్పుడు అందరి మదిలో ఆనందాన్ని నింపాయి. దశాబ్దాల కళ నెరవేరిన వేళ అందరి కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సైతం ఇదే పరవశానికి లోనయ్యారు. సీఎం చంద్రబాబు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశాక బాలికలు చేసిన లంబాడీ నృత్యం ఆకట్టుకుంది. ఇదే సందర్భంలో ఎమ్మెల్యే ఉగ్ర ఆనందంతో నృత్యం చేస్తూ కనిపించారు. ఈయనను మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య ఉత్సాహ పరచడం కనిపించింది.

చెయ్యెత్తి.. జైకొట్టి

ముఖ్యమంత్రి సభకు హాజరైన ప్రజల ఉత్సాహం

తరించే తరుణం: మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులపై కృష్ణా జలాలు చల్లుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

జన జాతర

వెలిగొండ ప్రాజెక్టు వద్దకు భారీగా వచ్చిన జనం

రైతుల కన్నీళ్లు ఆగిన రోజు

మార్కాపురం జిల్లా రైతుల కన్నీళ్లు ఆగిన రోజు. మనం కన్న కలలను సాకారం చేసిన రోజు ఇది. ఈ ప్రాంతంలో 1500 అడుగుల లోతు బోర్లు వేస్తే గాని నీరు వచ్చే పరిస్థితి లేదు. కరవుతో పోరాడుతున్న ఈ నేలలో వర్షం పడితే తప్ప మరో మార్గమే ఉండేదికాదు. ఇచ్చినమాట కోసం చంద్రబాబునాయుడు ప్రాజెక్టును పూర్తి చేశారు. కృష్ణాజలాలను తీసుకొచ్చారు. ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు. జిల్లా రైతులంతా ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉండాల్సిన అవసరం ఉంది.

– గూడూరి ఎరిక్షన్‌బాబు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి, యర్రగొండపాలెం

ఒక బాధ్యతగా తీసుకున్నారు

ఈ ప్రాంత ప్రజలను సంతోష పెట్టాలని ఒక బాధ్యతగా తీసుకొని వెలిగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పూర్తి చేశారు. కృష్ణాజలాలు మన ప్రాంత పొలాల్లోకి వచ్చేలా చేశారంటే సీఎం చంద్రబాబు మనకు దైవంతో సమానం. ఉద్యాన హబ్‌తో మార్కాపురం జిల్లాను అభివృద్ధి చేయబోతున్నారు. ఈ ప్రాంత ప్రజలను ఫ్లోరైడ్ నుంచి రక్షిస్తున్నారు. జిల్లాలో ఇన్ని అభివృద్ధి పనులు చేసిన వారు ఎవరైనా ఉన్నారా అని అందరూ ఆలోచన చేసుకోండి.

–కందుల నారాయణరెడ్డి, ఎమ్మెల్యే, మార్కాపురం

నా కళ్లతో చూస్తాననుకోలేదు...

మా ప్రాంతంలో తాగే నీటిలో, పండించే భూమిలో, తినే తిండిలో విషం ఉంది. పశువుల నుంచి వచ్చే పాలల్లోనూ గరళం ఉంది. అనేక మంది అంగవైకల్యంతో పుట్టారు. తక్కువ వయసులోనే చనిపోతున్నారు. కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ చేయించుకుంటున్నారెందరో. సకాలంలో సరైన వైద్యం అందక మా ప్రాంతంలో 195 మంది చనిపోయారు. నా జీవితంలో ఇటువంటి రోజు వస్తుందని అనుకోలేదు. నా కళ్లతో ఎప్పుడూ వెలిగొండ జలాలను చూస్తానని అనుకోలేదు. 30 ఏళ్ల కలను సాకారం చేసిన సీఎం చంద్రబాబునాయుడుకు పాదాభివందనం చేస్తున్నా. – ఉగ్ర నరసింహారెడ్డి, ఎమ్మెల్యే, కనిగిరి

అభివృద్ధికి ఊతమిచ్చారు...

రైతుల కళ్లల్లో ఆనందం చూడాలని, మన ప్రాంత వాసుల తలరాతలను మార్చాలని 1996లో సీఎం చంద్రబాబునాయుడు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. మన పశ్చిమ ప్రాంత ప్రజల తరపున ఆయనకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ఇక్కడి ప్రజల తలరాతను మార్చిన వ్యక్తి చంద్రబాబునాయుడు. వెలిగొండ జలాలను ఇవ్వడం ద్వారా మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలు రాబోయే రోజుల్లో అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయి. మార్కాపురం జిల్లా ఇచ్చి, నీళ్లు తెచ్చిన చంద్రబాబుకు పాదాభివందనం. –ముత్తుముల అశోక్‌రెడ్డి ఎమ్మెల్యే, గిద్దలూరు

నవోదయం కోసం సన్నద్ధం

- ఎక్కువ మంది విద్యార్థులు పరీక్ష రాసేలా కార్యాచరణ

చీమకుర్తి, ఒంగోలు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను నవోదయ పాఠశాలల బాట పట్టించేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మానస పుత్రికలుగా రూపుదిద్దుకున్న ఈ నవోదయ పాఠశాలల ప్రవేశ పరీక్షల కోసం ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఎక్కువ మందిని భాగస్వామ్యం చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం సహాయ సంచాలకులు, జిల్లా నోడల్ అధికారి సుబ్బారెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ఇటీవల ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు.

వెయ్యికి పైగా దరఖాస్తులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఒంగోలు, మార్కాపురంలో నవోదయ పాఠశాలలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 635 పాఠశాలలు ఉండగా జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. ఒక్కో పాఠశాలలో 80 సీట్లు ఉంటాయి. ఈ పాఠశాలల్లో ఆరో తరగతి చదివేందుకు ఏటా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుంటారు. ఆయా పాఠశాలల్లో ఐదో తరగతి చదివే విద్యార్థులు ఇందుకు అర్హులు. నవంబరు 28న జరగనున్న ప్రవేశ పరీక్ష కోసం ప్రకాశం జిల్లాలో 5967, మార్కాపురం జిల్లాలో 4136 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది అధికారుల చొరవతో రెండు జిల్లాల్లో కలిపి దరఖాస్తుల సంఖ్య సుమారుగా వెయ్యి వరకు పెరిగింది.

ప్రత్యేకంగా వాట్సప్ బృందం

విద్యార్థుల సన్నద్ధత కోసం ఆయా మండలాల్లో ఎంపిక చేసిన ఉపాధ్యాయులతో ప్రత్యేక వాట్సప్ బృందం ఏర్పాటు చేయాలని ఇటీవల ఒంగోలు జరిగిన సమావేశంలో సుబ్బారెడ్డి చెప్పారు. రోజూ మధ్యాహ్నం తర్వాత దరఖాస్తు చేసిన విద్యార్థులకు ప్రత్యేకంగా బోధిస్తున్నారు.

ఓటు ఉంటుందా.. ఊడుతుందా..

న్యూస్‌టుడే, ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. జూన్ 15 నుంచి జులై 24వ తేదీ వరకు సేకరించిన ఎన్యూమరేషన్ పత్రాల్లో పేర్కొన్న వివరాల్లో లోపాలున్నాయంటూ ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో మొత్తం 3,65,419 మంది ఓటర్లకు ఈఆర్వో, ఏఈఆర్వోలు నోటీసులు జారీ చేశారు. అందులో షెడ్యూల్ ప్రకారం ఆదివారం సాయంత్రానికి 1,71,509 మంది విచారణకు హాజరయ్యారు. తగిన పత్రాలు సమర్పించని కారణంగా అందులో ఇప్పటి వరకు 226 మందిని అనర్హులుగా గుర్తించారు. నోటీసులు అందుకున్న వారిలో ప్రకాశం జిల్లాలో 55.53 శాతం, మార్కాపురం జిల్లాలో 50.21 శాతం మందిని ఇంకా విచారించాల్సి ఉంది. ఈ నెల 28 లోపు విచారణ పూర్తి కావాలి. అక్టోబర్ 3న తుది జాబితా విడుదల చేయనున్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లలో ఎంత మంది తుది జాబితాలో మిగులుతారనే దానిపై అప్పుడు స్పష్టత రానుంది.

ముసాయిదా జాబితాలో తప్పులున్న ఓటర్లకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్వోలు నోటీసులు జారీ చేశారు. 'సర్' ప్రక్రియ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో క్లెయిమ్‌ల అభ్యంతరాల ప్రక్రియ వేగవంతం చేసేలా అధికార యంత్రాంగం ప్రణాళిక

ఒంగోలు ఏఈఆర్వో రాజశేఖర్‌కు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఓటర్లు

తప్పిదాలతో తాఖీదులు

చేస్తోంది. నోటీసు అందుకున్న ఓటర్లు సంబంధిత ధ్రువ పత్రాలతో నిర్దేశిత గడువులోపు ఈఆర్వో/ఏఈఆర్వో ఎదుట విచారణకు హాజరవుతున్నారు. ఆ సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల గుర్తింపు కార్డుల్లో తగిన ఆధారాలు చూపిస్తున్నారు. దూర ప్రాంతాల్లోని వారు ఆధారాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఓటుహక్కుపై ఏఈఆర్వోలు తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇంటి పేరు, తల్లిదండ్రుల పేర్లలో తప్పులు, ఇంటి నంబర్లలో లోపాలు, అక్షర దోషాలు, తండ్రి, కుమారుడి వయసులోనూ వ్యత్యాసాలు ఉండటంతో సంబంధిత ధ్రువ పత్రాలు అందజేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 3,65,419 మంది ఓటర్లకు నోటీసులు

జిల్లా	నోటీసులు	విచారణ చేసింది	అనర్హుల గుర్తింపు	పెండింగ్ ఓటర్లు
ప్రకాశం	1,96,196	87,255	48	1,08,941
మార్కాపురం	1,69,223	84,254	178	84,969

పుట్టుకతోనే బుద్ధిమాంద్యం, ప్రత్యేక అవసరాల పిల్లల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. చిన్నారుల్లోని లోపాలను సరిదిద్ది మానసిక, వ్యక్తిత్వ వికాసాన్ని పెంచేలా శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేసింది. చూపులేని పిల్లలకు బ్రెయిలీ లిపి నేర్పిస్తున్నారు. వారు బయటకు వెళ్లాలంటే మరొకరిపై ఆధారపడకుండా స్మార్ట్ కెయిన్స్ అందజేశారు. నడిచేటప్పుడు అడ్డంకులు ఉన్నా ప్రమాదం పొంచి ఉన్నా ముందుగా అవి హెచ్చరిస్తాయి. –న్యూస్‌టుడే, మద్దిపాడు

ఆప్యాయత పంచి.. ఆత్మవిశ్వాసం పెంచి

గుర్తింపు ఇలా.. : బడికి వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉంటున్న 3 నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలను గుర్తించేందుకు ఏటా ప్రత్యేక సర్వే చేస్తున్నారు. అంగన్‌వాడీ పాఠశాలకు వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. సంబంధిత పిల్లల తల్లిదండ్రులను కలిసి వారికి భవిత కేంద్రంలో అందించే సేవలపై అవగాహన కల్పిస్తున్నారు.

వివరాలు ఇవీ..	ప్రకాశం	మార్కాపురం
భవిత కేంద్రాలు	27	21
చిన్నారులు	752	657
హాజరవుతున్న వారు	537	417
ఇంటి వద్ద సేవలు	191	214

అందించే సాయం..: రవాణా, ఎస్కార్ట్ భత్యంగా ఏటా రూ.6 వేలు, బాలికలకు రూ.2 వేలను అందిస్తున్నారు. వినికిడి లోపం ఉన్నవారికి ప్రత్యేక పరికరాలు అందజేశారు. వారానికి ఒకసారి ఫిజియోథెరపీ సేవలందిస్తున్నారు. చిన్నారులకు బొమ్మలు, ఇతర పరికరాలతో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. కేంద్రానికి రాలేని పిల్లలకు శిక్షకులు వారి ఇంటి వద్దకే వెళ్లి పాఠాలు బోధించడమే కాకుండా వ్యాయామాలు చేయిస్తున్నారు. సమాజంలో ఎలా మెలగాలి... ఇతరులను ఎలా గౌరవించాలి.. వంటి ప్రాథమిక అంశాలతో పాటు చిత్రాలను గీయించడం, వివిధ ఆకృతులను తయారు చేయించడం వంటి విషయాల్లో తర్ఫీదు ఇస్తూ వారి మానసిక స్థితిని వికసించేలా కృషి చేస్తున్నారు.

మద్దిపాడు భవిత కేంద్రంలో విద్యార్థులకు ఆట వస్తువులతో శిక్షణ ఇస్తున్న సిబ్బంది

(c) eenadu

కృష్ణమ్మ చేరువై.. కరవు దూరమై

● వెలిగొండతో ఇక అన్నీ మంచి రోజులే

శ్రీశైలం, మార్కాపురం, కంభం పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రణాళిక బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో భాజపా నేత మాధవ్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బాలాజీ, మంత్రి రామానాయుడు, యర్రగొండపాలెం తెదేపా ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు

గేటు నుంచి బయటకు వస్తున్న కృష్ణా జలాలు

నృత్యం చేసిన బాలికలతో ఫొటో దిగి విజయసంకేతం చూపుతున్న చంద్రబాబు

ఉత్సాహంగా పచ్చ తువాళ్లు ఊపుతున్న సభకు హాజరైన జనం

కరవు సీమను కృష్ణమ్మ ముద్దాడటంతో అందరిలో ఉత్సాహం పరవళ్లు తొక్కింది. కళ్లారా చూద్దామని ఆబాలగోపాలం పరుగులు పెట్టారు. మార్కాపురం జిల్లాకు మంచి రోజులొచ్చాయని ఆనందించారు. వెలిగొండ జలాల విడుదల కార్యక్రమం సోమవారం ఘనంగా సాగింది. ముఖ్యమంత్రి రాక, కృష్ణమ్మకు జలహారతి, పూజలు, శిలాఫలకం, బ్రోచర్ల ఆవిష్కరణ కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, బృందం

వెలిగొండ జలాలు చూసేందుకు గుట్ట ఎక్కి వస్తున్న వృద్ధులు

వెలిగొండ జలాలు చూసేందుకు కొండ ఎక్కి వస్తున్న ప్రజలు

సీఎం రాక కోసం వేచిచూస్తున్న మంత్రులు, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు తదితరులు

పూజలు చేస్తున్న చంద్రబాబు, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, భాజపా నేత మాధవ్ తదితరులు

కృష్ణా జలాల విడుదల అనంతరం నమస్కరిస్తున్న చంద్రబాబు, పక్కన రామానాయుడు

నీటిని సీసాల్లో ఇంటికి తీసుకెళ్తున్న మహిళలు

వెలిగొండ ఇంజినీర్లకు ప్రశంసలు

సీఎం చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఈఈ కృష్ణారెడ్డి, మేఘా సంస్థ ఇంజినీర్ శ్రీనివాసులు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు రెండో సొరంగ నిర్మాణ పనుల పురోగతిలో తమవంతు పాటుపడ్డ ఇంజినీర్లు, మేఘా సంస్థ సిబ్బందికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రశంసా పత్రాలు అందజేశారు. గంటవానిపల్లె సమీపంలోని ఫీడర్ కాలువ వద్ద సోమవారం జరిగిన బహిరంగ సభలో ఆయన ఈఈ కృష్ణారెడ్డి, డీఈ రామస్వామిలతో పాటు మేఘా సంస్థలో పనిచేసిన ఇంజినీర్లు, సిబ్బందికి వాటిని పంపిణీ చేశారు.

ఆనందం... వెలికొండంత

ఎప్పటికవుతుందో అనుకునేవాడిని...

కరవు ప్రాంతానికి కృష్ణా జలాలు రావడం శుభపరిణామం. నా చిన్నప్పటి నుంచి ప్రాజెక్టు పనులు చూస్తూనే ఉన్నా. ఎప్పటికి పూర్తవుతాయో అనుకునేవాడిని. కూటమి ప్రభుత్వం అకుంఠిత దీక్షతో తొలివిడత పూర్తిచేసి జలాలు తీసుకువచ్చింది. వెనుకబడిన ప్రాంతం రూపు మారనుందన్న సంతోషం ఈ ప్రాంతవాసుల్లో కనపడుతోంది. వేడుకలో భాగస్వామిని కావాలని పల్నాడు జిల్లా వినుకొండ నుంచి వచ్చా.

– సుబ్బారావు, వినుకొండ

బోర్లు ఎండిపోవు...

మా గ్రామంలో భూగర్భ జలాలు పడిపోయి బోర్లకు సక్రమంగా నీరందక పంటలు సరిగా పండించలేకపోయేవాళ్లం. సేద్యం ఎప్పుడూ కత్తి మీద సాములానే ఉండేది. వెలిగొండ జలాలతో ఆ సమస్య తీరుతుంది. బంగారు పంటలు పండి... మా జీవితాలు బాగుపడతాయి. నిత్యం పనులు దొరుకుతాయి. ఉపాధి కోసం వలసలు వెళ్లే దుస్థితి ఉండదు. కూటమి ప్రభుత్వ కృషితోనే ఇది సాధ్యమైంది. కృష్ణా జలాలు చూసేందుకు వచ్చాం.

– వెంకటమ్మ, కట్టకానిపల్లి, దోర్నాల మండలం

స్థానికంగానే పనులు...

మా ప్రాంతంలో వ్యవసాయ పనులు లేక పక్క మండలాలకు ఆటోల్లో వెళ్లేవాళ్లం. వెలిగొండ జలాలతో ఆ బాధలు తప్పుతాయి. మా ఊళ్లోనే పొలం కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటాం. పెద్ద కాలువకు నీళ్లు రావడం చాలా ఆనందంగా ఉంది. వేడుక తిలకించేందుకు ఇంత మంది రావడం చూస్తుంటే మనస్సు ఉప్పొంగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదలతోనే వెలిగొండ సాధ్యమైంది. – మార్తమ్మ, గార్లదిన్నె

- న్యూస్‌టుడే, కంభం, అర్ధవీడు

మా ఊరి సమీపంలోనే వేడుక...

గతంలో ఫీడర్ కాలువ కోతకు గురైనప్పుడు ఆందోళనకు గురయ్యాం. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతోనే ప్రాజెక్టు త్వరగా పూర్తయ్యింది. నీళ్లు చూస్తుంటే చెప్పలేనంత సంతోషంగా ఉంది. మా ప్రాంతం పైరు పంటలతో కళకళలాడడంతో పాటు భవిష్యత్తు తరాలకూ మేలు కలుగుతుంది. మా ఊరి సమీపంలోనే ప్రాజక్టు ప్రారంభించడం ఆనందంగా సాగింది. గ్రామ చెరువును నింపితే ఇంకా బాగుంటుంది.

– వెంకటలక్ష్మమ్మ, గంటవానిపల్లి

వెబ్‌సైట్‌లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల జాబితా

ఒంగోలు గ్రామీణం: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత, మున్సిపల్, నగరపాలక సంస్థ పాఠశాలలకు ఎంపికైన 205 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ అభ్యర్థుల జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో సీవీ. రేణుక తెలిపారు. ఎంపికైనవారు సెప్టెంబర్ ఒకటిన విధుల్లో చేరాల్సిందిగా సూచించారు. సంబంధిత ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు ప్రతి నెలా 2న వారి పరిధిలో పని చేస్తున్న ఇన్‌స్ట్రక్టర్ల వీధులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

1,209 పొగాకు బేళ్ల తిరస్కరణ

ఒంగోలు గ్రామీణం: జిల్లాలోని రెండు రీజియన్ల పరిధిలోని వేలం కేంద్రాల్లో సోమవారం జరిగిన వేలంలో పలు కారణాలతో 1,209 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. ఎస్‌బీఎస్ రీజియన్ పరిధిలోని కేంద్రాలకు మొత్తం 6,628 బేళ్లను వేలానికి తీసుకురాగా, అందులో 499 బేళ్లు, ఎస్ఎల్ఎస్ రీజియన్ పరిధిలోని కేంద్రాలకు 5,421 బేళ్లు రాగా, అందులో 710 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. వేలం కేంద్రాల్లో పొగాకు కిలో అత్యధిక ధర రూ.250, అత్యల్ప ధర రూ.110 పలికింది.

వెన్నంటి కాపాడు స్వామీ!

• ఇష్ట దైవాలు, పూర్వీకుల సమాధుల వద్ద నిర్వాసితుల కన్నీటి వీడ్కోలు

గొట్టిపడియ రామాలయంలో పూజలు చేసేందుకు వచ్చిన భక్తులు

న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం, మార్కాపురం:పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలు ప్యాకేజీలు అందుకుని ఒక్కొక్కరుగా పుట్టిన ఊరును ఖాళీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మార్కాపురం మండలం గొట్టిపడియ గ్రామంలో తరాలుగా కొలిచిన ఇష్టదైవాలకు చివరిసారిగా మొక్కుకుంటూ ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామంలోని రామాలయం, పీర్ల చావిడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'తరలిపోతున్నాం.. ఇక తిరిగి రాలేం.. మా వెంట ఉండి కాపాడు స్వామీ' అంటూ దేవుళ్లను మొక్కుకున్నారు. పుట్టి పెరిగిన ఇల్లు, పూర్వీకుల సమాధులు, ఊరి జ్ఞాపకాలను వదిలి వెళ్లాల్సిన పరిస్థితి రావడంతో చివరి క్షణాల వరకూ సొతూర్లలో ఉండి భావోద్వేగానికి గురై తరలిపోయారు.

గ్రామాలను చూసుకుని, ఇక కనిపించవని..

● కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన దేవాయాలు, మసీద్‌లు, చర్చిలు, పాఠశాలలు ఇక మీదట కనిపించవని వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసిత ముంపు గ్రామాల ప్రజలు తీవ్ర భావోద్వేగానికి గురై గ్రామాలను వీడి వెళ్లిపోయారు. ● ప్రాజెక్టులోని ముంపు గ్రామాలైన సుంకేసుల, కలనూతల, గుండంచెర్ల, కాటంరాజుతండా, చింతలముడిపి, లక్ష్మీపురం, సాయి రాంనగర్, రామలింగేశ్వరపురం, గొడ్డిపడియ, అక్కచెరువుతండా ప్రజలు తమ ఇల్లు, పొలాలు, పుట్టిన గడ్డను చూసుకుని కన్నీరు పెట్టుకున్నారు. ● కలనూతల గ్రామంలోని పీర్ల మకానంలో ప్రత్యేక పూజలు చేసి ఆందరూ బోరును విలపించారు. మరి కొంత మంది వారి పూర్వీకులు, ఇటీవల చనిపోయిన వారి కుటుంబ సభ్యుల సమాధులను చూసుకుని కన్నీరు పెట్టుకున్నారు. ● ముంపు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాను అధికారులు సోమవారం కూడా పూర్తిగా నిలిపి వేశారు. దీంతో అన్ని గ్రామాల్లో సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. తాగునీటి సరఫరా కూడా ఆగిపోయింది. శుద్ధిజల కేంద్రాల వారు యంత్రాలతో పాటు సామాన్లను తీసుకుని వెళ్లిపోయారు.

గేట్లు ఎత్తిన సామాన్యులు

న్యూస్‌టుడే, యర్రగొండపాలెం: మార్కాపురం జిల్లా జీవనాడి పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు గేట్లు ఎత్తే అదృష్టం సామాన్యులకు లభించడం విశేషం. పెద్దదోర్నాల మండలం కటగానిపల్లెకు చెందిన రావెళ్ల సత్యనారాయణ, హసనాబాద్‌కు చెందిన చిత్తలూరి శాంతయ్య ఆ అదృష్టం దక్కించుకున్నారు.

కలలోనూ ఊహించలేదు..: మా ప్రాంతాన్ని బంగారంగా మార్చేందుకు నిర్మించిన ప్రాజెక్టు గేట్లు ఎత్తుతామని కలలోనూ ఊహించలేదు. వేడుక చూసేందుకు వచ్చిన నన్ను మంత్రి రామానాయుడు పిలవడం.. ముఖ్యమంత్రితో కలిసి గేట్లు ఎత్తే బటన్ నొక్కాలని చెప్పడం అంతా కలలా అనిపించింది. సీఎం స్వయంగా చేయిపట్టుకుని బటన్ ఆన్ చేయించడం నా పూర్వజన్మ సుకృతమే. ఇది రైతులకు ఆయన ఇచ్చే గౌరవంగా భావిస్తున్నాను. – రావెళ్ల సత్యనారాయణ

గొప్ప అవకాశం..: మత్స్యకారుడినైన నన్ను గుర్తించి మొదటి గేటు నా చేత్తోనే ఎత్తించారు. సీఎం, మంత్రి రామానాయుడు ఇంతటి గొప్ప అవకాశం ఇవ్వడం నా అదృష్టం. వెలుగొండ జలాలతో మా జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందీ ఉండదు. రైతులందరూ సంబరం చేసుకోవాల్సిన సమయమిది.

– చిత్తలూరి శాంతయ్య

నల్లమలసాగర్‌లో కృష్ణమ్మ పరవళ్లు

సుంకేసుల ప్రాంతంలో జల సవ్వడి

దశాబ్దాలుగా తడారిన కరవునేల కృష్ణా జలాల రాకతో కొత్త సింగారాన్ని సంతరించుకుంది. సోమవారం.. . ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి నీటిని విడుదల చేయడంతో పెద్దారవీడు మండలంలోని ముంపు గ్రామాలైన కలనూతల, సుంకేసులకు నీళ్లు చేరాయి. వీటిని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. జలాలను చూసి రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే నిర్వాసితులు ఆయా గ్రామాలను ఖాళీ చేసినా... కొంత మంది పశువులు, గ్రాసాన్ని అక్కడే ఉంచారు. చివరి రోజున వాటిని సైతం పూర్తిగా తరలించారు.

– న్యూస్‌టుడే, పెద్దారవీడు

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 120, రిటైల్ లైవ్ - 147, చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్- 257

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ పి.రాజాబాబు, జేసీ కల్పనాకుమారి

అర్జీదారుల్లో భరోసా నింపేలా చర్యలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: అర్జీదారుల్లో భరోసా నింపేలా ప్రతి ఒక్కరికీ సదరు కార్యాలయం నుంచి ఫోన్‌కాల్ చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులకు సూచించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ప్రజల నుంచి 191 అర్జీలను స్వీకరించారు. అర్జీ నమోదు వివరాలను తెలియజేస్తూ సమస్యలను త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీ ఓపెన్ అయిన అర్జీలను ప్రత్యేకంగా సమీక్షించి సమస్యలను పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. గతంలో సంతనూతలపాడు పంచాయతీ సర్పంచిగా అంకారావు ఉన్నప్పుడు జరిగిన రూ.30.48 లక్షల మేర నిధుల దుర్వినియోగానికి సంబంధించి రికవరీ చేయాలని కోరుతూ స్థానికుడు వీరబ్రహ్మయ్య కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జేసీ కల్పనాకుమారి, డీఆర్వో వెంకటరమణ, ఎస్‌డీసీ మాధురి, అధికారులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell:97011 12824
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell:91770 04831

ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌ను కలిసిన ఏపీ జేఏసీ అమరావతి సంఘం నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉద్యోగుల దీర్ఘకాలిక న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి పిలుపు మేరకు ఆ సంఘం నాయకులు ఉద్యమ కార్యాచరణ నోటీసును సోమవారం స్థానిక ప్రకాశం భవన్‌లో కలెక్టర్ పి. రాజాబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్ జి.ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించడంతో పాటు ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్వర్ణ గ్రామ, వార్డు ఉద్యోగులకు పదోన్నతులు, పొరుగు సేవల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పోలయ్య, బాలసుబ్రహ్మణ్య కుమార్, ఊతకోలు శ్రీనివాసరావు, ప్రశాంత్, ప్రసన్నకుమార్, ఎన్.శ్రీదేవి, లావణ్య, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

పెద్దారవీడు, న్యూస్‌టుడే: ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. పెద్దారవీడు మండలం గొబ్బూరు సమీపంలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... యర్రగొండపాలెం మండలం అమానిగుడిపాడుకు చెందిన స్నేహితులు పుచ్చకాయల లింగయ్య (24), చేపూరి గురురాజచారి (23) మార్కాపురం వెళ్లారు. పని ముగించుకుని ద్విచక్రవాహనంపై తిరిగి ఇంటికి బయలుదేరారు. ఇదే సమయంలో హనుమాన్ జంక్షన్‌కుంట వైపు నుంచి మరో ద్విచక్రవాహనం వస్తోంది. అమరావతి-అనంతపురం హైవేపై గొబ్బూరు సమీపంలో ఈ రెండు వాహనాలు ఢీకొనడంతో లింగయ్య, గురురాజచారికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో ఇద్దరూ మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దారవీడు పోలీసులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సంఘం నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జె.పంగులూరు మండలం నూజిళ్లపల్లి గ్రామంలో బీఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎల్‌పీ అధ్యక్షుడు దాసరి సుందరం మాట్లాడుతూ నూజిళ్లపల్లిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు షేక్ ఖాజావలి, షేక్ జిలానీ, దాసరి సంగీతరావు, డి.కోటమ్మ, మహాలక్ష్మమ్మ, సువార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీగా నాగమణి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీగా ఎం.నాగమణి నియమితులయ్యారు. నెల్లూరులో ప్రస్తుతం డీడీ హోదాలో విధులు నిర్వహిస్తున్న ఆమె తాజాగా జేడీగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన జేడీ నాగమణి మంగళవారం విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

డీవైఎఫ్ఐ రాష్ట్ర మహాసభల విజయవంతానికి పిలుపు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సెప్టెంబర్ ఒకటి నుంచి మూడో తేదీ వరకు నెల్లూరులో నిర్వహించనున్న భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.ఎఫ్.బాబు పిలుపునిచ్చారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో సోమవారం ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య నిరుద్యోగ యువత కోసం పోరాడుతోందని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు రూ.3 వేల భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. విభజన హామీల అమలు కోసం రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్రాన్ని నిలదీయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారంగా రాష్ట్ర మహాసభల్లో అజెండాగా తీసుకుని కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వి.పిచ్చయ్య, నాయకులు సురేష్, వంశీధర్, సీహెచ్.మోహన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును: బ్యాంకు లలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక దరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 73311 65666

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొన బడు ను. (స్పాట్ క్యాష్). ✆ 8142292071.

ప్రముఖ స్టార్ హోటల్ "గీతా రీజెన్సీ" నందు పనిచేయుటకు రుబ్బింగ్, కెప్టెన్స్, వెయిటర్స్, కిచెన్ అసిస్టెంట్స్, రూమ్ సర్వీస్ వెయిటర్స్, ఆర్డర్ టేకర్స్, హౌస్ కీపింగ్ బాయ్స్, కాఫీ స్టాల్, స్టోర్ కీపర్స్, రెస్టారెంట్ ఇంచార్జి మరియు కన్‌స్ట్రక్షన్ సూపర్ వైజర్స్ వెంటనే కావలెను. అనుభవమును బట్టి ఆకర్షణీయమైన జీతం.సంప్ర.4/1, అరండల్‌పేట గుంటూరు. 9949077525.

SBI LIFE ఉద్యోగ అవకాశాలు నందు నియామకాలు జరుగుచున్నవి వయస్సు18 To 70 సం|| అర్హత 10వ తరగతి ఆపైన సంప్ర: 9640252922

JOBS

మధుసూదన్ ఆటోఫైనాన్స్ H.O లో పనిచేయుటకు టెలికాలర్స్-5, అకౌంటెంట్స్-2 కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. ✆ :8886688938, 9246469894.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటన కర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే
వివరాలకు..
97011 12824
ఒంగోలు 80087 09902
మార్కాపురం 80081 11050
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500
Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

అద్దంకి

•అద్దంకి • దర్శి

అసంబద్ధ ఓటర్లు ధ్రువపత్రాలందించాలి

అద్దంకి, న్యూస్‌టుడే : తాఖీదులు అందుకున్న అసంబద్ధ ఓటర్లు సెప్టెంబరు 28వ తేదీ లోపు సంబంధిత పత్రాలు సమర్పించాల్సి ఉందని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారిణి/ఆర్డీవో విజయజ్యోతికుమారి అన్నారు. సర్ ప్రక్రియ ప్రారంభానికి పూర్వం అద్దంకి నియోజకవర్గంలో మొత్తం 2,45,727 మంది ఓటర్లున్నారన్నారు. సర్ పరిశీలనలో మృతులు, డబుల్ ఎంట్రీలు, వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నవారు 26,341 మందిని గుర్తించి తుది జాబితాను 2,19,386గా తేల్చారు. ఇందులోనూ అసంబద్ధ ఓటర్లుగా 31,019 మంది ఉన్నారు. వారందరూ ఓటర్లుగా నమోదు కావాలంటే సచ్చీలతను రుజువు చేసుకోవాల్సి ఉంది. ఆమేరకు ఆయా ఓటర్లకు తాఖీదులను అందించారు. తిరిగి సరైన పత్రాలతో సచివాలయం వద్ద జరిగిన విచారణకు హాజరు కావటం లేదు. మొత్తం 314 పోలింగ్ కేంద్రాలకు గాను 242 పోలింగ్‌కేంద్రాల పరిధిలో 22,917 మంది అసంబద్ధ ఓటర్లు తమ ధ్రువపత్రాలు అందించారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలో సెప్టెంబరు 8వ తేదీ వరకు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు ధ్రువీకరణ పత్రాలు స్వీకరిస్తారని ఈఆర్వో చెప్పారు.

• పీజీఆర్ఎస్‌కు మొత్తం ముగ్గురు మాత్రమే అర్జీదారులు హాజరైనట్లు ఆర్డీవో సీహెచ్ విజయ జ్యోతికుమారి తెలిపారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో విజయజ్యోతికుమారి

అసౌకర్యాల నడుమ చదువులు

దొనకొండ, న్యూస్‌టుడే: దొనకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సౌకర్యాలు కొరవడి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 1983లో 5.16 ఎకరాల్లో అయిదు గదులతో భవనాన్ని నిర్మించారు. అప్పట్లో అన్ని గ్రూపుల విద్యార్థులు అధికంగా ఉండేవారు. ప్రస్తుతం హెచ్ఈసీ, సీఈసీ మాత్రమే ఉండటంతో 113 మంది అందులో చదువుతున్నారు. ప్రహరీ లేకపోవటంతో పశువులు ఆవరణలోకి వస్తున్నాయి. రాత్రి వేళ మందుబాబులకు అడ్డాగా మారింది. వసతి గృహం లేదు. అదనంగా మూడు తరగతి గదులు, వసతిగృహం, ప్రహరీ, ఆర్వోప్లాంటు ఏర్పాటుచేస్తే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుంది. కళాశాలలో అసౌకర్యాలుండటంతో చుట్టుపక్కల ప్రాంతాల వారు దర్శి, మార్కాపురం, వినుకొండ, నరసరావుపేటకు వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో అదనపు ఖర్చులు తప్పడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించి వెంటనే నిధులు మంజూరుచేసి సమస్యలను తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రహరీ లేని ప్రభుత్వ జూనియర్ కళాశాల

పూర్వ విద్యార్థి దాతృత్వం

☛ రూ.8 లక్షల ల్యాప్‌టాప్‌ల అందజేత

జె.పంగులూరు, న్యూస్‌టుడే: పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం మరువలేనిదని చీరాల డిప్యూటీ డీఈవో గంగాధర్ అన్నారు. మండలంలోని బూదవాడ జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి ఈమని అనంతారెడ్డి తన తండ్రి బలరామిరెడ్డి జ్ఞాపకార్థం రూ.8 లక్షల విలువైన 15 ల్యాప్‌టాప్‌లను పాఠశాలకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.డి.వి.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చీరాల డిప్యూటీ డీఈవో గంగధర్ మాట్లాడారు. విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకు దాత అనంతారెడ్డి తన సొంత ఖర్చుతో వాలంటీర్‌ను నియమించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో షేక్ కాలేషావలీ, కొండమంజులూరు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం అనిత, వడ్డవల్లి వీరనారాయణ, గ్రామ పెద్దలు సుబ్బారెడ్డి, బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో గంగాధర్. చిత్రంలో దాత అనంతారెడ్డి తదితరులు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

అద్దంకి, న్యూస్‌టుడే : విద్యుత్తు టవర్లపైకి తీగలు అమర్చే పనులు చేపట్టనున్న నేపథ్యంలో అద్దంకి పట్టణంలో మంగళవారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ దామోదరం తెలిపారు. భవానీకూడలి నుంచి బస్టాండ్ అవుట్‌గేట్ వరకు (ఒంగోలు రోడ్డుకు పడమర) వీఎన్ఎస్ థియేటర్, ఏడీబీ బ్యాంక్, సంజీవనగర్, భాగ్యనగర్ పరిసరాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిచిపోతుందని డీఈఈ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

అద్దంకి	: 94409 15704
దర్శి	: 98486 71678
మేదరమెట్ల	: 79933 00506

సజ్జాపురం (సంతమాగులూరు), న్యూస్‌టుడే : ?: స్థానిక బీసీ కాలనీలో రెండుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలి. – స్థానికులు, సజ్జాపురం

✓: వీధి దీపాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తాం. – వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి, సజ్జాపురం

సాగర్ నీరొచ్చె.. కష్టాలు తీరె..

న్యూస్‌టుడే, అద్దంకి, సంతమాగులూరు, బల్లికురవ :

సాగర్ జలాలు అద్దంకి బ్రాంచి కెనాల్‌కు చేరడంతో గ్రామాల్లో నీటి కష్టాలు దూరం కానున్నాయి. మంచినీటి అవసరాల నిమిత్తం మూడురోజుల క్రితం జలాశయం నుంచి విడుదల చేయడంతో ఆదివారం రాత్రి జిల్లా సరిహద్దు సంతమాగులూరు మండలం అడవిపాలెం 18/0 మైలురాయి వద్దకు జలాలు చేరాయి. సోమవారం ఉదయానికి ధర్మవరంలో 33/2 మైలురాయికి, సాయంత్రానికి జె.పంగులూరు మండలం రామకూరు సమీపానికి వచ్చాయి. ఆరంభంలో 1015 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా 33/2 మైలురాయి వద్దకు 700 క్యూసెక్కులు ప్రవహిస్తున్నాయి.

అద్దంకి బ్రాంచి కెనాల్ పరిధిలో..

ఏబీసీ పరిధిలోని అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలోని 90 నోటిఫైడ్ చెరువుల్ని నింపుతారు. ఇందులో భాగంగా ఎగువన గల అన్ని మేజరు, మైనరు కాలువల్ని మూసేశారు. గ్రామాల్లోని చేపల చెరువుల నిర్వాహకులు నీటిని తరలించకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అద్దంకి ఎన్నెస్పీ ఎస్ఈ సీహెచ్‌వీ సతీష్ నాయకత్వంలో ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, రెవెన్యూ ఉద్యోగులు కాలువలపై పహారా కాస్తున్నారు. విధులు నిర్వహించాల్సిన లస్కర్ల సంఖ్య పదిశాతం కూడా లేకపోవటంతో మిగిలిన శాఖల అధికారులే పర్యవేక్షణ చేస్తున్నారు.

అధికారుల పరిశీలన

33/2 మైలురాయి వద్ద జల ప్రవాహం

పసుమర్రు, పమిడిపాడుకు..

ఎగువన అన్ని కాలువల షట్టర్లు మూసివేయడంతో సంతమాగులూరు మండలంలోని పసుమర్రు, జె.పంగులూరు మండలంలోని పమిడిపాడు మేజరు తలుపులు తెరిచారు. వాటి పరిధిలోని సజ్జాపురం, కొమ్మాలపాడు, చెన్నుపల్లి, ఉప్పుమాగులూరు, చిన్నకొత్తపల్లి, మక్కెనవారిపాలెం చెరువులకు నీరు వెళుతోంది. పమిడిపాడు మేజరుకు 250 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఈ విషయమై ఈఈ సతీష్ మాట్లాడుతూ నీటి పరిమాణం ఎక్కువగా ఉన్నందున సర్దుబాటు చేసుకుని అందిస్తున్నామన్నారు. అన్ని నోటిఫైడ్ ట్యాంక్‌లు నింపుతామని వివరించారు.

అధ్వానంగా తారు రోడ్డు

ముండ్లమూరు నుంచి తూమాడు వెళ్లే రహదారి పూర్తిగా పాడైపోయింది. తారు పూర్తిగా కనుమరుగై రాళ్లు బయటకు వచ్చాయి. ఈ దారిలో ప్రయాణించే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేదని తూమాడువాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ముండ్లమూరు

వీధి దీపాలు వెలిగి రెండేళ్లు !

కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలోని బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న సెంట్రల్ లైటింగ్ దీపాలు వెలిగి రెండేళ్లు దాటింది. అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో దీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒంగోలు వైపు నుంచి వచ్చే వాహనాలు ఈ ప్రదేశంలోనే మలుపు తిరుగుతాయి. డివైడర్‌పై ఉన్న కొన్ని వీధిదీపాలు కూడా వెలగడం లేదని స్థానికులు వాపోయారు. సమస్యపై పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్‌ను వివరణ కోరగా త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, మేదరమెట్ల

కొత్త పింఛన్లు మంజూరు

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురు మహిళలకు కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో అజిత తెలియజేశారు. మండలానికి ప్రస్తుత నెలకుగాను 6063 మందికి రూ. 2,65,05,000లు విడుదలయ్యాయన్నారు. మంగళవారం ఉదయం నుంచే పంపిణీ ప్రారంభించి సాయంత్రంలోపు నూరుశాతం అందించేందుకు కృషిచేస్తామన్నారు.

అయిదు అర్జీల అందజేత

తాళ్లూరు, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి అయిదుగురు రైతులు వచ్చి తహసీల్దారు రమణారావుకు అర్జీలు అందజేశారు. ఆన్‌లైన్ కోసం ఇద్దరు, మ్యుటేషన్ల కోసం ముగ్గురు రైతులు వారి సమస్యలను విన్నవించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. దీంతో తహసీల్దారు స్పందించి వీలైనంత త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. గృహనిర్మాణశాఖ ఏఈ హనుమంతరావు, ఏపీవో వెంకటేశ్వర్లు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పారా మెడికల్ సిబ్బంది నిరసన

అద్దంకి, న్యూస్‌టుడే : వైద్య ఆరోగ్యశాఖలో ఒప్పంద విధానంలో పనిచేస్తున్న పారా మెడికల్ సిబ్బంది డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలని ఉద్యోగ సంఘ నాయకులు ఎ.నాయక్ అన్నారు. ఆగస్టు 21వ తేదీ నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేయనున్నట్లు చెప్పారు. తక్షణం తమ సమస్యలకు పరిష్కరించాలని వినతిపత్రాన్ని ఆసుపత్రి కార్యపర్యవేక్షకురాలు డాక్టర్ వాహెలాచౌదరికి అందించారు.

నేటి నుంచి సెక్షన్ 30 పోలీసు యాక్ట్

ఒంగోలు నేరవిభాగం: ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో నేటి నుంచి సెక్షన్ 30 పోలీసు యాక్టును అనుసరించి నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించకూడదని అన్నారు. మైకులు వినియోగించాలన్నా, బాణసంచా కాల్చాలన్నా పోలీసుల అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

దర్శి శివాలయంలో ధ్వజస్తంభ ఏర్పాటు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

దర్శి, న్యూస్‌టుడే: దర్శి పట్టణంలోని ప్రాచీన శివాలయంలో సోమవారం ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ పునఃనిర్మాణ పనుల్లో భాగంగా ఈ వేడుక నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య కార్యక్రమం భక్తి ప్రవత్తులతో సాగింది. దర్శి పట్టణంతో పాటు సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఇందిరానగర్‌లో రహదారి నిర్మాణం

అద్దంకి, న్యూస్‌టుడే: పాఠశాల విద్యార్థులు, శుద్ధజల కేంద్రానికి చేరుకునే ప్రజల అవసరాల నిమిత్తం ఇందిరానగర్‌లో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారు. పురపాలక నిధులతో చేపట్టిన ఈ నిర్మాణం వల్ల పట్టణ ప్రజలకు మరింత ప్రయోజనం ఉంటుందని ఏఈ లోకేష్ తెలిపారు. పాలక మండలి హయాంలోనే తీర్మానం ఉండటం..స్థానికుల విజ్ఞప్తి మేరకు శుద్ధ జల కేంద్రం వరకు సీసీ రోడ్డును విస్తరించనున్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు పనులు

గ్రామాలకు నీటి సరఫరా పునరుద్ధరణ

స్పందనకు వందనం

బొమ్మనంపాడు (అద్దంకి), న్యూస్‌టుడే : మూడుగ్రామాలకు మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ నెల 16న 'ఈనాడు'లో 'గ్రామాల్లో దాహం కేకలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఈ నెల 29న బొమ్మనంపాడుకు వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు స్థానికులు సమస్యను నివేదించారు. ఈ మేరకు ఆయన ఆదేశం మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ఎస్ఈ బీవీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేశారు. గుండ్లకమ్మ నదిలోని ఊటబావికి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరఫరా అందించారు. సోమవారం ఉదయానికి మూడు గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు గుండ్లకమ్మ జలాలు చేరాయి. దీంతో ఆయా గ్రామాల్లో మంచినీటి సమస్యకు తెరపడింది.

ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం

దర్శి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయునిగా విద్యార్థులకు, పాఠశాల అభివృద్ధికి నర్సిరెడ్డి చేసిన సేవలు అభినందనీయమని ఎంఈవోలు మాలకొండయ్య, రమాదేవి అన్నారు. దర్శి తూర్పు ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా సోమవారం నర్సిరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. **తాళ్లూరు:** దారంవారిపాలెం ప్రాథమిక పాఠశాల్లో సోమవారం పదవీ విరమణ చేసిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు దమ్మాలపాటి అంజయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. అక్కడి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎంఈవోలు సుబ్బయ్య, సుధాకరరావు, ఇతర ప్రముఖులు కలసి సత్కరించారు. హెచ్ఎంలు ప్రసాద్, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయ సంఘ నాయకులు శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష తగదు

అద్దంకి, న్యూస్‌టుడే : 2030 సంవత్సరం నాటికి ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని హెల్ప్ స్వచ్ఛంద సేవాసంస్థ ప్రాజెక్టు సంచాలకులు బీవీ సాగర్ అన్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కాకానిపాలెం, గొరకాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, శింగరకొండ కేఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. పీడితుల పట్ల వివక్ష చూపరాదన్నారు. అనుమానితులను అద్దంకిలోని ఏఆర్‌టీ కేంద్రం వద్ద ఉచితంగా పరీక్షిస్తారని, వివరాలు గోప్యంగా ఉంచుతారన్నారు. ఆయా కార్యక్రమాల్లో కేఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ వి.మోహనరావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ముద్దన విష్ణుప్రసాద్, ఎల్.సుజాత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హెల్ప్ సంస్థ ప్రతినిధి బీవీ సాగర్

సుబాబుల్, జామాయిల్ తోటలు దగ్ధం

జె.పంగులూరు: ప్రమాదవశాత్తు అగ్గిరాజుకొని ఏడు ఎకరాల్లో ఉన్న సుబాబుల్, జామాయిల్ తోటలు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన మండలంలోని రేణింగవరం పొలాల్లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రేణింగవరానికి చెందిన రైతులు యల్లాల బ్రహ్మారెడ్డి, బోరెడ్డి కోటిరెడ్డి, యాతం శ్రీనివాసరెడ్డి, సుబ్బారావుకు సుబాబుల్, జామాయిల్ తోటలున్నాయి. సోమవారం మధ్యాహ్న సమయంలో తోటల్లో నిప్పురవ్వలు ఎగసిపడి మంటలంటుకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. రూ.7 లక్షల నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. ప్రమాదానికి కారణం ఏమిటన్నది తెలియరాలేదు.

రాజ్యాధికారంతోనే హక్కుల సాధన

అద్దంకి, న్యూస్‌టుడే: విజయవాడ ధర్నాచౌక్‌లో ఈ నెల 10న జరిగే 'దళిత గర్జన' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య అన్నారు. అంబేడ్కర్‌భవన్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దళితుల కష్టాలు తీరాలన్నా, హక్కులు సాధించుకోవాలన్నా రాజ్యాధికారం ద్వారానే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కొమ్మూరి గరటయ్య, రావినూతల కోటి, పల్లెపోగు త్రిపుర, నాగయ్య, శామ్యేలు, శ్యాంసన్, మాధవ్ పాల్గొన్నారు.

విద్యుత్తుస్తంభాన్ని ఢీకొని చోదకుడి దుర్మరణం

గొర్రెపాడు (అద్దంకి, బల్లికురవ), న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనం విద్యుత్తుస్తంభాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో చోదకుడు (30) దుర్మరణం చెందాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి బల్లికురవ మండలం గొర్రెపాడులో చోటు చేసుకుంది. ఎస్సై నాగరాజు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా వినుకొండ నుంచి కొప్పెరపాడు వైపు వస్తున్న ద్విచక్రవాహనం గొర్రెపాడు వద్ద అదుపుతప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో చోదకుడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గమనించి 108కు సమాచారమిచ్చారు. సిబ్బంది పరిశీలించి చోదకుడు మృతిచెందినట్లు తెలిపారు. బల్లికురవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుని వివరాలపై ఆరా తీస్తున్నారు.

తెదేపా నేత సుబ్బారావు మృతి

బల్లికురవ: తెదేపా మండల సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ పోగుల ద్రాక్షాయమ్మ భర్త పోగుల సుబ్బారావు సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలువురు అధికారులు, ప్రముఖులు సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చెరువులు నింపేందుకు ఏర్పాట్లు

తాళ్లూరు, కురిచేడు, న్యూస్‌టుడే : సాగరు జలాలు సోమవారం మధ్యాహ్నం దొనకొండ ప్రాంతం నుంచి పరుగులు తీస్తున్నాయి. సాయంత్రానికి కురిచేడు సమీపాన 202 మైలురాయి వద్ద ఆరు వందల క్యూసెక్కుల మేర ప్రవహిస్తోంది. ప్రస్తుతం దర్శి బ్రాంచి కాలువ నుంచి నీరు సరఫరా అవుతోంది. జిల్లా పరిధిలోని దొనకొండ మండలంలో రెండు, కురిచేడు పట్టణంలోని మరో చెరువు, దర్శి వద్ద రెండు చెరువులు, చీమకుర్తి మండలంలోని రామతీర్థం జలాశయాన్ని ఈ జలాలతో నింపనున్నారు. పదిహేను రోజులపాటు నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాబోయే నాలుగైదు నెలల పాటు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తుగా ప్రయత్నాలు చేస్తున్నారు. నీటిచౌర్యానికి పాల్పడకుండా నిఘా పెంచాల్సి ఉంది.

పంపింగ్ మొదలు..

దొనకొండ: దొనకొండ మండలంలోని మూడు మంచినీటి చెరువులకు సోమవారం మధ్యాహ్నం నుంచి సాగర్‌కాలువ నీటిని పంపింగ్ చేస్తున్నారు. 15 రోజుల్లో పూర్తిస్థాయిలో నింపుతామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్‌కుమార్ చెప్పారు. చందవరం-1 చెరువు నుంచి దొనకొండ మండలంలోని 29 గ్రామాలు, చందవరం-2 నుంచి హనుమంతునిపాడులోని 67, కొనకనమిట్లలోని 55, పొదిలి మండలంలో 5 గ్రామాలకు నీటి సరఫరా అవుతుంది. లక్ష్మీపురం నుంచి మార్కాపురంలో 12, తర్లుపాడులో 12, దొనకొండలో 6, కొనకనమిట్ల 2 గ్రామాలకు నీరు విడుదల అవుతుంది. మోటార్లు అన్నీ సక్రమంగా పని చేస్తున్నాయని సిబ్బంది కూడా దగ్గరుండి మంచినీటి చెరువులు నిండేలా చూస్తారన్నారు.

కురిచేడులో జలకళ

చందవరం-2 చెరువుకు తరలుతున్న జలాలు

ప్రమాదకరంగా మురుగు కాలువ

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలోని గాంధీనగర్‌కు వెళ్లే దారి ప్రారంభంలో మురుగు కాలువ ప్రమాదకరంగా మారింది. మురుగు కాలువ లోతుగా ఉండటం..ఎటువంటి బండరాళ్లు లేకపోవడంతో ఆ ప్రదేశంలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళ మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులంటున్నారు. అధికారులు స్పందించి కాలువపై బండరాళ్లు వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

80 బస్తాల బియ్యం పట్టివేత

కురిచేడు, న్యూస్‌టుడే: పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ వాహనాన్ని సోమవారం ఉదయం కురిచేడు గ్రామస్థులు చాకచక్యంగా పట్టుకున్నారు. నూజెండ్ల మండలంలోని చెర్వుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన బి. దుర్గాప్రసాద్ మినీ వాహనంలో 80 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని కురిచేడు సమీపంలోంచి తరలిస్తుండగా గ్రామస్థులకు అనుమానం వచ్చి వాహనాన్ని వెంబడించారు. దీంతో నిందితుడు స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో వాహనాన్ని వదిలేసి పరారయ్యాడు. ఈ మేరకు వారు అధికారులకు సమాచారమిచ్చారు. ఈ ఘటనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఎస్సై కోటయ్య తెలిపారు.

(c) eenadu

కందుకూరు

• కందుకూరు • కొండపి

విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు సాగుచేసిన పంటల నమోదు ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో డివిజన్ స్థాయి వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయాలన్నారు. పంట నమోదులో లింగసముద్రం మండలంలో 60 శాతం పూర్తి కాగా.. గుడ్లూరులో 30 శాతం మాత్రమే చేశారన్నారు. పీఎం కిసాన్ గుర్తింపు సంఖ్య లేనివారి వివరాలను మండల కేంద్రాలకు పంపామని, వాటిని పరిశీలించి వెంటనే నమోదు చేయాలన్నారు. రైతు చనిపోయినా, భూమి విక్రయించినా ఆయా వివరాలను నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఏడీఏ అబ్దుల్ రహీం, ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు, సిబ్బందితో సమావేశమైన జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్

శిక్షణ ఉపకలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వివిధ సంఘాల ఉద్యోగులు

డిమాండ్లు నెరవేర్చాలని వినతి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: తమ హక్కుల సాధనలో భాగంగా ఏపీ అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శిక్షణ ఉపకలెక్టర్ రాజు మాధ్యూకు వినతిపత్రం అందజేశారు. డీఏ బకాయిలు చెల్లించాలని, న్యాయమైన కోర్కెల సాధన నిమిత్తం అమరావతి జేఏసీకి తమ మద్దతు తెలుపుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ ఛైర్మన్ విజయభాస్కర్ మాట్లాడుతూ ఉద్యమానికి ప్రతి ఉద్యోగి సహకరించాలన్నారు. రెవెన్యూ, ఆర్టీసీ, స్వర్ణగ్రామ కార్యాలయ, ఒప్పంద ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు పెరిగిన కౌలు ఆదాయం

ఉలవపాడు, న్యూస్‌టుడే: ఉలవపాడు పంచాయతీ కె.రాజుపాలెంలోని నెల్లూరు జిల్లా శ్రీతల్పగిరి రంగనాయకస్వామి ఆలయ భూములకు నిర్వహించిన కౌలు వేలంలో గతం కన్నా ఆదాయం పెరిగినట్లు ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం కె.రాజుపాలెంలోని భూములకు ఉలవపాడులోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద కౌలు వేలం నిర్వహించారు. 7 ప్లాట్లుగా ఉన్న 28 ఎకరాల మెట్ట భూములను రూ.6,36,500లకు అయిదుగురు వ్యక్తులు దక్కించుకున్నారు. గతంలో ఈ పొలానికి రూ.51,400 మాత్రమే కౌలు వచ్చింది. కార్యక్రమంలో ఉలవపాడు ఈవో రంగరాజు, రెండు ఆలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పరివర్తకం చుట్టూ రక్షణ ఏర్పాట్లు

స్పందనకు వందనం

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపి కల్యాణ మండపం ఎదుట చేతికందే ఎత్తులో ఉండి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు పరివర్తకం చుట్టూ అధికారులు రక్షణ ఏర్పాట్లు చేశారు. ఈ సమస్యపై గత నెల 31న 'ఈనాడు'లో 'ప్రమాదకరంగా పరివర్తకం' అనే శీర్షికన ప్రచురితమైన చిత్ర కథనానికి ఆ శాఖ అధికారులు స్పందించి.. రక్షణ ఏర్పాట్లు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైకాపా పాపం.. ఇళ్ల నిర్మాణాలకు శాపం

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో నిలిచిపోయిన పనులు తిరిగి చేపట్టేందుకు ఆయా లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బిల్లులు వస్తాయని అప్పుచేసి నిర్మాణాలు ప్రారంభించారు. తీరా అవి రాకపోవడం ప్రధాన సమస్యగా మారింది. కొండముడుసుపాలెంలో 98 మందికి పట్టాలు ఇవ్వగా వారిలో కొద్ది మంది మాత్రమే నిర్మాణాలు పూర్తి చేశారు. మిగిలిన వారివి వివిధ స్థాయిల్లో నిలిచిపోయాయి. మండలం అంతా ఇదే పరిస్థితి నెలకొంది. మరోవైపు చేసిన అప్పులకు వడ్డీ పెరిగిపోతుండటంతో మిగిలిన పనులు పూర్తి చేసేందుకు సాహసం చేయలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి సాయం చేయాలని కోరుతున్నారు.

కొండముడుసుపాలెం కాలనీలో నిలిచిన నిర్మాణాలు

పొగాకు సాగు నియంత్రణ అవసరం

టంగుటూరు: రైతులు పొగాకు సాగు నియంత్రణ పాటించాలని టంగుటూరు పొగాకు వేలం కేంద్రం క్షేత్ర అధికారి ఉపేంద్ర అన్నారు. బోర్డు పరిధిలోని చింతలపాలెం గ్రామంలో 2026-27 కాలానికి పొగాకు పంట నియంత్రణపై రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోర్డు అనుమతించిన మేరకు పంట పండించాలన్నారు. అత్యాసకు పోయి పొలం, బ్యారన్ కౌలు ధరలు ఇష్టారీతిన పెంచుకోవద్దన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకొని మంచి దిగుబడులు ఇచ్చే ప్రత్యామ్నాయ పంటలు పండించాలన్నారు.

బియ్యం దందా.. ఆపేదుండా..

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

పేదల బియ్యం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేయాల్సినవి పక్కదారి పడుతున్నాయి. యథేచ్ఛగా బహిరంగ మార్కెట్‌కు తరలిపోతున్నాయి. సింగరాయకొండలో ఎలాంటి అనుమతులు లేకుండానే కొందరు బియ్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. వీటి మాటున కల్తీకి పాల్పడుతూ.. వివిధ రకాల సంచుల్లో నింపి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై పర్యవేక్షణ లేకపోవడంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ● మండల కేంద్రం సింగరాయకొండ కేంద్రంగా కొందరు రేషన్ బియ్యాన్ని భారీగా నిల్వచేసి అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. మరికొందరు రకరకాల పేర్లతో సంచుల్లో నింపి ఎలాంటి అనుమతులు లేకుండానే అమ్మకాలు సాగిస్తున్నారు. చుట్టుపక్కల మండలాల నుంచి బియ్యం కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. కొన్ని చోట్ల డీలర్లు సర్వర్ మొరాయిస్తోందని, ఆన్‌లైన్‌లో పేరు నమోదులో తేడా ఉందంటూ తదితర కారణాలతో పేదలకు బియ్యం పంపిణీ చేయకుండా దారి మళ్లిస్తున్నారు. మరికొందరు కార్డుదారుల వద్ద కిలో రూ.10కి కొనుగోలు చేసి రూ.16 చొప్పున వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వీటిని 25 కేజీల సంచుల్లో నింపి రైసు మిల్లులు, రహస్య ప్రదేశాల్లో భారీగా నిల్వ చేసినట్లు సమాచారం. సింగరాయకొండ, మూలగుంటపాడు, పాకల, సోమరాజుపల్లి గ్రామాల పరిధిలోని మిల్లుల్లో కల్తీకి పాల్పడుతున్నారన్న ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి.

● ఎల్‌నినోను బూచిగా చూపి ఇప్పటికే వ్యాపారులు బహిరంగ మార్కెట్‌లో కేజీ బియ్యం రూ.70 చొప్పున విక్రయిస్తున్నారు. పట్టించుకోవాల్సిన రెవెన్యూ, పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. రేషన్ బియ్యం కల్తీ, అక్రమ రవాణాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కాశయ్య మాట్లాడుతూ మిల్లుల్లో తనిఖీలు చేస్తామని చెప్పారు. అనుమతి లేకుండా దుకాణాలు నిర్వహించే వారు, కల్తీకి పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

2,245 పొగాకు బేళ్ల కొనుగోలు

టంగుటూరు, కొండపి గ్రామీణం: టంగుటూరు, కొండపి వేలం కేంద్రాల పరిధిలో సోమవారం 2,245 పొగాకు బేళ్లు కొనుగోలు చేసినట్లు నిర్వహణాధికారులు సత్యశ్రీనివాస్, ఎం.శంకర్‌రావు తెలిపారు. ● టంగుటూరు కేంద్రానికి చిరికూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1,252 బేళ్లను తీసుకురాగా.. 1,092 కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. ● కొండపి కేంద్రానికి గుర్రపడియా, మూగచింతల, కె.అగ్రహారం, నెన్నూరుపాడు, చతుకుపాడు గ్రామాలకు చెందిన రైతులు 1443 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 1153 కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. కిలో గరిష్ఠ ధర రూ. 250, కనిష్ఠ ధర రూ. 110 పలికినట్లు పేర్కొన్నారు.

కరిగిన నిధులు.. కానరాని స్వచ్ఛత

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని అమ్మపాలెం పంచాయతీలో నిధులు ఖర్చు చేస్తున్నా పారిశుద్ధ్యం అధ్వానంగానే ఉంటోంది. మూడు నెలల క్రితం కాలువల్లోని వ్యర్థాలను తొలగించి బయటకు తరలించినందుకు రూ. 1,33,158 గుత్తేదారుడికి చెల్లించినట్లు ఆన్‌లైన్ నివేదికలో పొందుపర్చారు. ఇటీవల ఈ గ్రామంలో ఇంటింటికీ తెదేపా కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు పర్యటించినప్పుడు పలు బజార్లలో నెలకొన్న అపరిశుభ్రతపై అధికారులను ప్రశ్నించినట్లు స్థానికులు చెబుతున్నారు. తీరుమారకపోవడంతో అపరిశుభ్రత, దోమల కాటుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అమ్మపాలెంలోని రామాలయం ఎదుట ఇలా..

విద్యార్థులకు ఉపకార వేతనాలు

ఉలవపాడు, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరంలో 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థుల్లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన 10 మంది విద్యార్థులకు ఉల్లాస్ ట్రస్టు హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో యంగ్ అచీవర్స్ ఉపకార వేతనాలు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీజీ తెలిపారు. ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు

శుద్ధ జలకేంద్రం తెరిపించాలి

గుడ్లూరు: మండలంలోని చెంచిరెడ్డిపాలెంలో మూసివేసిన ఆర్వోప్లాంట్‌ను తిరిగి తెరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి కోరారు. సాగునీటి వనరుల సందర్శనలో భాగంగా సీపీఎం నాయకులు సోమవారం ఆ గ్రామంలో పర్యటించారు. ఆర్వోప్లాంట్‌కు సంబంధించిన పరికరాలు మరమ్మతులకు గురవడంతో ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తెలిపారన్నారు. వీబీ జీ రామ్‌జీ పనులు ఇప్పటి వరకు కేవలం అయిదు వారాలు మాత్రమే కల్పించారని ఆరోపించారు. నాయకులు వెంకటేశ్వర్లు, వెంకయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

కందుకూరు: 70939 81624
కొండపి: 96424 56296

కందుకూరు గ్రామీణం: ?: మండలంలోని పలుకూరు గ్రామ దక్షిణ బజారులో పంట కాలువ మురుగు కాలువను తలపిస్తోంది. దుర్వాసన వస్తోంది. -వెంకటేశ్వర్లు, పలుకూరు
✓: పరిశీలించి శుభ్రం చేయిస్తాం. -శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి

మర్రిపూడి: ?: మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ జి.అగ్రహారం బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిపూట చీకట్లో తిరగాల్సి వస్తోంది. -బాలరాజు, స్థానికుడు
✓: మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. -ఆరిఫ్, స్థానికుడు

లింగసముద్రం: ?: మండలంలోని మొగిలిచర్లలో వీధి దీపాలు మరమ్మతులకు గురై అంధకారం నెలకొంది. -శ్రీను, గ్రామస్థుడు
✓: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి మరమ్మతులు చేయిస్తాం. -శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ

జరుగుమల్లి: ?: మండలంలోని చింతలపాలెం గ్రామంలో పగటి వేళ విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయి. -వెంకటేశ్వర్లు, స్థానికుడు
✓: త్వరలో ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తాం. -వందనం, పంచాయతీకార్యదర్శి

సింగరాయకొండ గ్రామీణం: ?: సింగరాయకొండ పంచాయతీ పరిధి భైరాగిమాన్యం, మదీనా వీధిలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను వెంబడించి గాయపరుస్తున్నాయి. -అబ్దుల్, స్థానికుడు
✓: వీధి కుక్కల బెడద తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. -శారద, ఈవోపీఆర్డీ

?: సింగరాయకొండ ప్రధాన రహదారి విభాగినిపై వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంటోంది. -నరసింహారావు, గ్రామస్థుడు
✓: వెంటనే మరమ్మతులు చేయిస్తాం. -వెంకట్, పంచాయతీ మెకానిక్

గుడ్లూరు: ?: మండలంలోని పోట్లూరు ఎస్సీ కాలనీలో ఆర్వో ప్లాంటు మరమ్మతులకు గురైంది. నీటికి ఇబ్బందులు పడుతున్నాం. -కార్తికరాణి, స్థానికురాలు
✓: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -మల్లికార్జునరావు, ఎంపీడీవో

వలేటివారిపాలెం: ?: నేకునాంపురంలో ఉపాధి పనులు కల్పించడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. -కోటయ్య, స్థానికుడు
✓: క్షేత్ర, సాంకేతిక సహాయకులతో మాట్లాడి పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటాం. -దయాసాగర్, ఏపీవో

ఉలవపాడు: ?: మండలం కేంద్రం ఉలవపాడులో మసీదుకు వెళ్లే దారిలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గుంపులుగా సంచరిస్తూ అటుగా వెళ్లేవారిపై దాడి చేస్తున్నాయి. దీంతో బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. -ఖాదర్, ఉలవపాడు
✓: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. -వీరయ్య, పంచాయతీ కార్యదర్శి

అసలే మట్టిదారి.. ఆపై అధ్వానంగా మారి

మండలంలోని స్వర్ణాజిపురం-పాజర్ల అనుసంధాన మార్గం అధ్వానంగా తయారైంది. సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉండే గ్రావెల్ రహదారిలో మోకాలిలోతున గోతులు పడ్డాయి. ఈ మార్గంలో ఈ రెండు గ్రామాల ప్రజలతో పాటు చెమిడిదిపాడు, కొత్తపేట వాసులు పొలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వ్యవసాయ సీజన్‌లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. **న్యూస్‌టుడే, గుడ్లూరు**

విలువైన జలం వృథా పాలు

ఎల్‌నినో కారణంగా నీరు లేక ఓవైపు ఇబ్బందులు పడుతుంటే.. కొందరు పశువుల కాపరులు తాగునీటి పైపుల వాల్వుల నుంచి నీటిని మళ్లిస్తున్నారు. మండలంలోని పాజర్ల వద్ద ఎలికేరు సమీపంలో స్వర్ణాజిపురం నీటి పైపులకు రెండు చోట్ల వాల్వులున్నాయి. వీటిని కొందరు పశువుల కాపరులు తిప్పుతున్నారు. ఆ నీటిని పశువుల తాగునీటికి ఉపయోగిస్తున్నారు. ఈ కారణంగా జలం కలుషితం కూడా అవుతోందని గ్రామానికి చెందిన పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాల్వులను సరిచేసి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, గుడ్లూరు**

చేతిపంపు.. పట్టించుకోక తుప్పు

కొండపి మండలం తాటాకుపాలెం గ్రామంలో తాగునీటి బోరు మరమ్మతులకు గురైంది. పంచాయతీ సరఫరా చేసే నీరు నిలిచిపోయినప్పుడు బోరుపై ఆధారపడుతుంటామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, వెంటనే చేతి పంపునకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కిశోర్ మాట్లాడుతూ సిబ్బందిని పంపి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. - **న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం**



పొంచి ఉన్న ప్రమాదం

రాళ్లపాడు జలాశయం ఎడమ కాలువపై మలుపు వద్ద ఉన్న రక్షణ గోడ దెబ్బతింది. ఆ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీంతో మలుపు వద్ద ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించడంతో పాటు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, లింగసముద్రం**

ఇరువైపులా బళ్లు.. రాకపోకలకు ఇక్కట్లు

పొగాకు బేళ్లు విక్రయించేందుకు టంగుటూరు వేలం కేంద్రానికి రైతులు తీసుకొస్తున్న ట్రాక్టర్లను బోర్డు లోపల సరైన స్థలం లేనికారణంగా టంగుటూరు-కొండపి మార్గంలో నిలుపుతున్నారు. నిన్నమొన్నటి దాకా ఓ వైపు మాత్రమే నిలుపుతుండగా.. సోమవారం మాత్రం రోడ్డుకి ఇరువైపులా నిలిపారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారికి ఇబ్బందిగా మారింది. ఏ వాహనం తగిలి ప్రమాదం జరుగుతుందోనని చోదకులు ఆందోళన చెందుతున్నారు. - **న్యూస్‌టుడే, టంగుటూరు**

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో చోదకుడికి గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఓగూరు గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై కందుకూరు వస్తున్న ఎం.సుబ్బారావును.. మాల్యాద్రికాలనీ వద్ద కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహన చోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ● **టంగుటూరు:** ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం పైవంతెనపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలు నుంచి టంగుటూరు వైపు ద్విచక్ర వాహనంపై వ్యక్తి వెళ్తుండగా.. అదుపుతప్పి 16వ నంబరు జాతీయ రహదారి అంచున పడ్డాడు. సదరు వ్యక్తికి గాయాలు కాగా.. హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కి తరలించారు. ప్రమాదానికి గురైన వ్యక్తి స్పృహ తప్పడంతో వివరాలు తెలియరాలేదు.

రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

అర్హుల ఓట్లు తొలగించబోం

ఒంగోలు గ్రామీణం: 'సర్' ప్రక్రియలో అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరును తొలగించబోమని ఒంగోలు ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నో మ్యాపింగ్, ఇతర తప్పుల కారణంగా నోటీసులు జారీ చేసిన ఓటర్లకు ఏఈఆర్వోల సమక్షంలో మూడుసార్లు విచారణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నో మ్యాపింగ్‌కు సంబంధించి ఓటరు చిరునామా ఆధారంగా ఎస్‌ఈసీ నిబంధనల మేరకు తదుపరి చర్యలు ఉండనున్నట్లు తెలిపారు. మృతులు, రెండేసి చోట్ల ఉన్న ఓట్లను 'సర్' ప్రక్రియలో భాగంగా తొలగించనున్నట్లు వివరించారు. జాబితాలో తప్పులు ఉంటే సరిచేయనున్నట్లు పేర్కొన్నారు.

గడువు లోగా సర్ పూర్తి చేయండి

లింగసముద్రం, న్యూస్‌టుడే: సర్ కార్యక్రమాన్ని గడువు లోగా పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.కోటేశ్వరరావు బీఎల్వోలను ఆదేశించారు. చినపవనిలో సోమవారం ఆయన పర్యటించారు. పెండింగ్ దరఖాస్తులను త్వరగా విచారించాలన్నారు. నమోదులో ఎటువంటి అవకతవకలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అధికారులతో సమావేశమైన పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్

పంచాయతీల అభివృద్ధికి సమష్టిగా కృషి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సమష్టిగా పని చేద్దామని పీఆర్ ఎస్‌ఈ బి.చంద్రశేఖర్ అన్నారు. సంతపేటలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ సర్కిల్ కార్యాలయంలో నూతన ఎస్‌ఈ చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం మంజూరు చేసిన పనులన్నీ సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా సాంకేతిక సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో పీఆర్ డీఈలు నాగేశ్వరరావు, ప్రకాష్‌రెడ్డి, ఏఈ శ్రీవత్సకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ పి.రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

నేటి నుంచి సెక్షన్ 30 పోలీసు యాక్ట్

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో నేటి నుంచి సెక్షన్ 30 పోలీసు యాక్టును అనుసరించి నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించకూడదని అన్నారు. మైకులు వినియోగించాలన్నా, బాణసంచా కాల్చాలన్నా పోలీసుల అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అష్టావధానంతో విద్యార్థుల్లో ఏకాగ్రత

కొత్తపట్నం, న్యూస్‌టుడే: ఈతముక్కలలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం అష్టావధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పున్నయ్య మాట్లాడుతూ తెలుగు భాషలోని అమృతతుల్యమైన మాధుర్యాన్ని ఆస్వాదించడానికే కాకుండా, విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, మేధో వికాసాన్ని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. నారాయణం బాలసుబ్రహ్మణ్యాన్ని ఉపాధ్యాయులు సత్కారించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల కేంద్రం.. మురుగు సంద్రం

వివరాలు ఇలా..
గ్రామం పేరు: గుడ్లూరు
కుటుంబాల సంఖ్య: 2228
జనాభా: 8001

గుడ్లూరు, న్యూస్‌టుడే: పేరుకే మండల కేంద్రం. కనీస మౌలిక వసతులు కొరవడటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే నీరు రహదారులపై నిలుస్తుండటంతో పాదచారులు సైతం రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధాన వీధి మినహా ఎక్కడా మురుగు కాలువలు లేవు. ఈ కారణంగా దోమల బెడద నెలకొంది. ప్రధానంగా మిట్టపాలెం మార్గం, బీసీ కాలనీ, కమ్మపాలెం, యాదవ బజారు ప్రాంతాల్లో సమస్య ఎక్కువగా ఉంది. కొందరి గృహాల్లోకి నీరు వస్తుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ● గతేడాది అక్టోబరులో పంచాయతీ కార్యాలయం నుంచి విద్యుత్తు ఉపకేంద్రం వరకు మురుగు కాలువల నిర్మాణానికి సుమారు రూ. 40 లక్షలు మంజూరయ్యాయి. ఇందు కోసం శంకుస్థాపన కూడా చేశారు. కానీ ఇంత వరకు ఆయా పనులు ప్రారంభించలేదు. ● బీసీ కాలనీలో ప్రధాన వీధితో పాటు ఆరు అడ్డరోడ్లు ఉన్నాయి. గృహాల నుంచి వచ్చే నీరంతా సిమెంటు రహదారులపై ప్రవహిస్తోంది. గాంధీ బొమ్మ ఎదురు వీధితో పాటు యాదవ బజారులో నీరు నిలుస్తోంది. ఇక్కడ కొద్దిపాటి ఆక్రమణలు తొలగిస్తే సమస్య ఉండదు. గతేడాది గృహాల్లోకి నీరు చేరడంతో విలువైన సామగ్రి దెబ్బతింది. ● పంచాయతీ కార్యాలయం వద్ద మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంతో తూర్పుప్రాంతం నుంచి వచ్చే నీరంతా ఆ ప్రాంతంలో నిలిచి చెరువులా మారుతోంది. ● గ్రంథాలయం ఎదురు మార్గంలో ఎగువ నుంచి వచ్చే నీరు నిలిచి కాలువను తలపిస్తోంది. ● మిట్టపాలెంలో మురుగు కాలువలు లేవు. చిరుజల్లులకే సిమెంట్ రహదారులు మురుగుమయంగా మారుతున్నాయి. ● 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం గ్రామం మొత్తం అంతర్గత మురుగు కాలువల నిర్మాణానికి రూ. కోటి మంజూరు చేసింది. ఆ తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ పనులను రద్దుచేసింది. ● సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున్న మెయిన్ బజారులో మురుగు కాలువలు చిన్నవిగా ఉండటంతో వర్షపు నీరు రహదారిపై ప్రవహిస్తోంది. కాలువలు వెడల్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువలే లేని బీసీ కాలనీలోని ఓ బజారు

గుడ్లూరు ప్రధాన వీధిలో వర్షం కురిస్తే ఇదీ పరిస్థితి

డెడ్ స్టోరేజీ నిల్వతో సాగు నీరు ఎలా సాధ్యం

మార్కాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు ద్వారా విడుదల చేసిన 10 టీఎంసీల డెడ్ స్టోరేజీ నీటితో 1.19 లక్షల ఎకరాలకు సాగు నీరు, 4 లక్షల మందికి తాగునీరు ఎలా సాధ్యమని సోమవారం ఒక ప్రకటనలో జిల్లా సీపీఎం ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం డ్యామ్‌లోని నీరు అంతంత మాత్రంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమవుతుందా అని అన్నారు. నీటిని వ్యవసాయ భూములకు సరఫరా చేయడానికి కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా, మరమ్మతులకు గురి అయిందన్నారు. తాగునీటి కుళాయిలకు పైపులైన్ల నిర్మాణం నేటికీ కాలేదన్నారు. నిర్వాసితుల సమస్యలను పట్టించుకోకుండా నీటిని విడుదల చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నేటికీ పట్టాలు, పునరావాసం పూర్తి కాలేదన్నారు. నిర్వాసితులు ఎక్కడ ఉండాలో ప్రభుత్వం చెప్పాలన్నారు. ప్రభుత్వం తక్షణమే నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సోమయ్య డిమాండ్ చేశారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడిగా పనిచేసిన డాక్టర్ శ్రీధర్‌రావు సేవలు ప్రశంసనీయమని పలువురు పశువైద్యులు పేర్కొన్నారు. శ్రీధర్‌రావు ఉద్యోగ విరమణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. విధి నిర్వహణలో ఆయన అందించిన సేవలు ఆచరణీయమని అన్నారు. అనంతరం సత్కరించారు. వైద్యులు శ్రీకాంత్ చెన్నకేశవరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ● మర్రిపూడి, న్యూస్‌టుడే: అంకితబావంతో పనిచేస్తే అందరి మన్ననలు పొందవచ్చని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో నామ జగదీష్ ఉద్యోగ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు కొనియాడారు. అనంతరం జగదీష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో నరసింహమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో నాగూర్‌వలీ, ఎంపీటీసీ సభ్యులు చిరంజీవి, కొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

LIC 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
మా కస్టమర్లకు, అధికారులకు, ఏజెంట్స్ మిత్రులకు,
LIC 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.
LIC లో వివిధ రకాల పాలసీలు కొరకు సంప్రదించండి.
మేడికొండ వెంగళరావు, LIC ఏజెంట్
టంగుటూరు, Cell: 8500858744

(c) eenadu

ఒంగోలు

• ఒంగోలు • సంతనూతలపాడు

వెంకటేశ్వరరెడ్డి సేవలు అభినందనీయం

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుడిగా వివిధ పాఠశాలల్లో వాకా వెంకటేశ్వరరెడ్డి అందజేసిన సేవలు అభినందనీయమని చీమకుర్తి మండల విద్యాశాఖాధికారి డి.వి.నరసింహారావు అన్నారు. మండలంలోని ఆర్‌ఎల్‌పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ చేసిన వెంకటేశ్వరరెడ్డి సత్కార సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్.పద్మావతి సభకు అధ్యక్షత వహించారు. పాఠశాల, వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో వెంకటేశ్వరరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. గోనుగుంట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండి శ్రీనివాసరావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మరమ్మతుల దృష్ట్యా ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు, గుత్తికొండవారిపాలెం, రొయ్యల చెరువుల ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు మండల ఏఈ శ్రీధర్ తెలిపారు.

ప్రమాదాలకు నిలయాలు.. ఈ కూడళ్లు

• ఎన్‌హెచ్‌-216పై ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే

• బాపట్ల జిల్లా పర్చూరు మండలం చిననందిపాడు గ్రామానికి చెందిన నర్రా వెంకటరామయ్య(60), పెదనందిపాడుకు చెందిన తుమాటి బ్రహ్మయ్య(65) జూన్ 11న ద్విచక్ర వాహనం మీద వెళ్తుండగా జాతీయ రహదారి 216పై ఉన్న నీలాయపాలెం జంక్షన్ వద్ద చీరాల వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటరామయ్య అక్కడికక్కడే మృతి చెందగా, బ్రహ్మయ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు.

• పెదగంజాంకు చెందిన తెదేపా సీనియర్ నాయకుడు వెంకయ్య(50) ఆరు నెలల క్రితం ద్విచక్ర వాహనంపై ఉప్పుగుండూరు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా నీలాయపాలెం జంక్షన్ వద్ద కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు.

• మాచవరం గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆరు నెలల క్రితం ఒమ్మెవరం వచ్చి, తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఉప్పుగుండూరు బైపాస్‌లోని మాచవరం జంక్షన్ వద్ద లారీ ఢీకొని దుర్మరణం పాలయ్యాడు.

• రెండేళ్ల కిందట ఉప్పుగుండూరుకు చెందిన బెల్లం నాగేశ్వరరావు(55) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మాచవరం జంక్షన్ వద్ద కారు ఢీకొని మృతి చెందాడు.

నిత్యం వందలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే త్రోవగుంట నుంచి దిగమర్రు వరకు ఉన్న 216వ జాతీయ రహదారిపై రోజూ ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. నాగులుప్పలపాడు మండల పరిధిలో చేకూరపాడు నుంచి ఉప్పుగుండూరు బైపాస్‌లోని నీలాయపాలెం జంక్షన్ వరకు ఈ మార్గం విస్తరించి ఉంది. ఉప్పుగుండూరు బైపాస్ రోడ్డులో మాచవరం, నీలాయపాలెం జంక్షన్ల వద్ద వాహనదారులు, ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. పలువురు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు గాయాలపాలవుతున్నారు.

జంక్షన్ల వద్ద కుంభాకార దర్పణాల ఏర్పాటు

నాగులుప్పలపాడు సమీపంలోని ఇంకొల్లు జంక్షన్, చదలవాడ, మద్దిరాలపాడు, చేకూరపాడు, తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారిపై ఉన్న వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రివేళ అంధకారం నెలకొంటుంది. జాతీయ రహదారి నిర్వహణను గాలికొదిలేశారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతుండటంతో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి భద్రతా చర్యలు తీసుకోవాలని చోదకులు కోరుతున్నారు. ఈ విషయమై ఎస్సై మహేంద్రనాయక్‌ను వివరణ కోరగా ఇంకొల్లు, నీలాయపాలెం జంక్షన్ల వద్ద కుంభాకార దర్పణాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

ఉప్పుగుండూరు బైపాస్‌లోని నీలాయపాలెం జంక్షన్

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఒంగోలు నగరం	: 8008574067
ఒంగోలు గ్రామీణం	: 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు	: 8247324766
కొత్తపట్నం	:8464085451
ఎస్.ఎన్.పాడు	: 8008552692

మద్దిపాడు: ?: మద్దిపాడులోని ఎస్సీ కాలనీకి తూర్పున ఉన్న రహదారిలో విద్యుత్తు పరివర్తకాల చుట్టూ పిచ్చి మొక్కలు అల్లుకున్నాయి. దీంతో గాలులు వీచినప్పుడు మంటలు వ్యాపిస్తున్నాయి. **- సుబ్బారావు, స్థానికుడు**
✓: విద్యుత్తు సిబ్బందిని పంపి పరివర్తకాల చుట్టూ అల్లుకున్న మొక్కలను తొలగించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.
- చంద్రకాంత్, విద్యుత్తుశాఖ ఏఈ, మద్దిపాడు

కొత్తపట్నం: ?: రాజుపాలెం గ్రామంలోని ప్రధాన రహదారిలో డ్రైనేజీల్లో పూడిక తొలగించకపోవడంతో మురుగు పేరుకుపోయింది. వెంటనే మురుగు కాలువలను శుభ్రం చేయించాలి. **- శ్రీనివాసరావు, స్థానికుడు**
✓: వెంటనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
- కిరణ్, పంచాయతీ కార్యదర్శి

ఒంగోలు అంజయ్యరోడ్డు: ?: ఒంగోలు నగరంలోని పులివెంకటరెడ్డి కాలనీలో మురుగు కాలువలను సరిగ్గా శుభ్రం చేయడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. కాలువలను వెంటనే శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలి. **- శ్రీనివాసరావు, స్థానికుడు**
✓: మురుగు కాలువలను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరిస్తాం.
- పిచ్చయ్య, శానిటరీ సూపర్‌వైజర్

నేటి నుంచి సెక్షన్ 30 పోలీసు యాక్ట్

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో నేటి నుంచి సెక్షన్ 30 పోలీసు యాక్టును అనుసరించి నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించకూడదని అన్నారు. మైకులు వినియోగించాలన్నా, బాణసంచా కాల్చాలన్నా పోలీసుల అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పౌరహక్కులు ప్రజలందరికీ సమానమే

మద్దిపాడు, న్యూస్‌టుడే: కులం, మతం, ప్రాంతం, లింగ, వర్గ విభేదాలు లేకుండా పౌర హక్కులు ప్రజలందరికీ సమానమేనని మద్దిపాడు తహసీల్దార్ ఆదిలక్ష్మి అన్నారు. గుండ్లాపల్లి ఎస్సీ కాలనీలో వీఆర్వో సుధాకర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన పౌరహక్కుల అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు అందరికీ వర్తిస్తాయని, వాటికి ఎవరైనా భంగం కలిగిస్తే మా దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. పిల్లలందరినీ పాఠశాలలకు పంపించి విద్యావంతులను చేయాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే సమాచారం అందించాలని చెప్పారు. గ్రామాల్లో రోడ్లు, కాలువలు, పింఛన్ల పంపిణీ గురించి ఆరా తీశారు. ఆర్ఐ రమణయ్య, పంచాయతీ అభివృద్ధి అధికారి మణిదీప్, స్వర్ణ గ్రామ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి సమష్టిగా కృషి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సమష్టిగా పని చేద్దామని పీఆర్ ఎస్ఈ బి.చంద్రశేఖర్ అన్నారు. సంతపేటలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ సర్కిల్ కార్యాలయంలో నూతన ఎస్ఈ చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం మంజూరు చేసిన పనులన్నీ సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా సాంకేతిక సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో పీఆర్ డీఈలు నాగేశ్వరరావు, ప్రకాష్‌రెడ్డి, ఏఈ శ్రీవత్సకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ పి.రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

అధికారులతో సమావేశమైన పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్

ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయండి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: గ్రామాలకు కేంద్ర ప్రభుత్వ నిధుల కేటాయింపునకు సంబంధించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని వెలుగు ఏపీఎం బాబూరావు సూచించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో రెండోరోజు వీపీఆర్‌పీ యాప్‌లో నమోదులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ శ్రేయస్సు స్థితిస్థాపక ప్రణాళికలను రూపొందించాలని అన్నారు. డ్వాక్రా గ్రూపుల అవసరాలు, అర్హతలు, జీవనోపాధుల, సామాజిక అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసి యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు, వెలుగు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

సత్వర సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో నిబద్ధత కలిగిన వ్యక్తి నరసింహారావు అని డీఆర్వో వెంకట రమణ అన్నారు. కలెక్టరేట్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న నరసింహారావు ఉద్యోగ విరమణ సన్మాన సభ స్థానిక ప్రకాశం భవన్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రస్తుత జూనియర్ ఉద్యోగులు కూడా ప్రజలకు సత్వర సేవలు అందించి వారి మన్ననలు అందుకోవాలని సూచించారు.

దాడిలో నలుగురికి గాయాలు

ఒంగోలు నేరవిభాగం;: భార్యాభర్తల మధ్య నెలకొన్న వివాదంలో దాడి చేయడంతో నలుగురు వ్యక్తులు గాయపడ్డ ఘటన ఒంగోలులోని మర్రిచెట్టుకాలనీలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు కాలనీకి చెందిన ఫణిదపు సతీష్, మనీషా దంపతుల మధ్య వివాదం నెలకొనగా, సతీష్ సోదరుడు శివరామకృష్ణ అందులో జోక్యం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి సతీష్, శివరామకృష్ణ కలిసి మనీషా తల్లి ఇంటిపై దాడికి వెళ్లారు. మనీషాతో పాటు ఆమె సోదరులపై కత్తితో దాడి చేయడంతో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులు సోమవారం తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ విజయ్‌కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అష్టావధానంతో విద్యార్థుల్లో ఏకాగ్రత

కొత్తపట్నం, న్యూస్‌టుడే: ఈతముక్కలలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం అష్టావధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పున్నయ్య మాట్లాడుతూ తెలుగు భాషలోని అమృతతుల్యమైన మాధుర్యాన్ని ఆస్వాదించడానికే కాకుండా, విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, మేధో వికాసాన్ని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. నారాయణం బాలసుబ్రహ్మణ్యాన్ని ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంసీహెచ్ సూపరింటెండెంట్ వెంకటరావుకు ఉద్యోగోన్నతి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు మాతా, శిశు వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటరావు సీనియారిటీ ప్రాతిపదికన డీసీహెచ్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఈ మేరకు ఆయన్ను అనంతపురం జిల్లా వైద్య, విధాన పరిషత్తు సమన్వయకర్తగా నియమిస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి జి.వీరపాండ్యన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరును తొలగించం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 'సర్' ప్రక్రియలో అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరును తొలగించబోమని ఒంగోలు ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నో మ్యాపింగ్, ఇతర తప్పుల కారణంగా నోటీసులు జారీ చేసిన ఓటర్లకు ఏఈఆర్వోల సమక్షంలో మూడుసార్లు విచారణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నో మ్యాపింగ్‌కు సంబంధించి ఓటరు చిరునామా ఆధారంగా ఎస్ఈసీ నిబంధనల మేరకు తదుపరి చర్యలు ఉండనున్నట్లు తెలిపారు. మృతులు, రెండేసి చోట్ల ఉన్న ఓట్లను 'సర్' ప్రక్రియలో భాగంగా తొలగించనున్నట్లు వివరించారు. జాబితాలో తప్పులు ఉంటే సరిచేయనున్నట్లు పేర్కొన్నారు.

వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్

ఒంగోలు, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సందర్భంగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి వైకాపా అధినేత జగన్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని, క్షమాపణ చెప్పాలని జిల్లా వైకాపా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. వైకాపా హయాంలో జగన్ కేవలం రెండు టన్నెళ్లను మాత్రమే జాతికి అంకితం చేశారనీ, ప్రాజెక్టు పూర్తిచేసినట్లు ఎక్కడా చెప్పలేదని అన్నారు. ఒక్క కులం వాళ్లు ఓట్లు వేస్తేనే జగన్ సీఎం అయ్యారని చెప్పడం దారుణమని అన్నారు. ఎంపీ మాగుంట వెంటనే క్షమాపణ చెప్పి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పొగాకు పంట సాగును తగ్గించుకోండి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మార్కెట్ సంక్షోభం పరిస్థితుల నేపథ్యంలో రానున్న ఏడాదికి పొగాకు పంట సాగును తగ్గించుకోవాలని ఒంగోలు-2 వేలం కేంద్రం నిర్వహణాధికారిణి తులసి రైతులకు సూచించారు. త్రోవగుంట, మద్దిరాలపాడు, ఏడుగుండ్లపాడు గ్రామాల్లో సోమవారం 'పొగాకు పంట నియంత్రణ'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోర్డు అనుమతి మేరకే పంట సాగు చేయాలన్నారు. రానున్న సీజన్‌కు బ్యారన్‌కు 20 క్వింటాళ్ల పంట ఉత్పత్తికి మాత్రమే అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు పొగాకు బ్యారన్ లీజు, పొలం కౌలు ధరలు పెంచుకోవద్దన్నారు. పొగాకు సాగుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. అనంతరం రైతులతో కలిసి పంట నియంత్రణపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

సదస్సులో మాట్లాడుతున్న వేలం కేంద్ర నిర్వహణాధికారిణి తులసి

పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: చీర్వానుప్పలపాడులో పోలేరమ్మ తల్లిని ప్రతిష్ఠించి 19 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయంలో అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు 101 బిందెలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. పలువురు మొక్కులను చెల్లించుకొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

చీమకుర్తి, న్యూస్‌టుడే: జాతీయ అంధత్వ నివారణ ప్రాజెక్టులో భాగంగా చీమకుర్తి సామాజిక వైద్యశాలకు చెందిన పారామెడికల్ ఆప్తమాలిక్ అసిస్టెంట్ సంధ్య మాధవి మంచికలపాడు, బండ్లమూడి హరిజనవాడ, తొర్రగుడిపాడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి ఆరోగ్యం కోసం విటమిన్ ఎ పుష్కలంగా లభించే ఆకుకూరలు, గుడ్డు తినాలని విద్యార్థులకు సూచించారు. అవసరమైన వారికి కళ్లద్దాలు సిఫార్సు చేసినట్లు చెప్పారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డి.హనుమంతు, వై.రమేష్, జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తమాలిక్ అసిస్టెంట్

పీజీఆర్ఎస్ అర్జీలను వెంటనే పరిష్కరిస్తాం

కొత్తపట్నం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరిస్తామని తహసీల్దార్ రామానాయుడు తెలిపారు. కొత్తపట్నం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి ఆరు అర్జీలను స్వీకరించారు. భూమి ఆన్‌లైన్ చేయాలని మోటుమాల గ్రామం నుంచి రెండు అర్జీలు, భూ సర్వే చేయాలని మడనూరు నుంచి రెండు అర్జీలు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కొత్తపట్నం నుంచి రెండు అర్జీలు వచ్చాయని చెప్పారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

• మద్దిపాడు, న్యూస్‌టుడే: మద్దిపాడులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అయిదు అర్జీలను స్వీకరించినట్లు డిప్యూటీ తహసీల్దార్ అజయ్ కుమార్ తెలిపారు. భూములను సర్వే చేయించాలని నాలుగు అర్జీలు, మ్యూటేషన్ కోసం ఒక అర్జీ మొత్తం అయిదు అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు. సాధ్యమైనంత త్వరలో వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

రాజ్యాంగం ప్రసాదించిన శక్తిమంతమైన ఆయుధం ఓటు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జేసీ కల్పనాకుమారి సూచించారు. ఒంగోలు సమీపంలోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం 'స్వీప్' కార్యక్రమంపై నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు అనేది రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన అత్యంత శక్తిమంతమైన ఆయుధమన్నారు. విద్యార్థులు దేశ భవిష్యత్తును నిర్దేశించడంలో క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. అర్హత కలిగిన యువత ఓటరు హెల్ప్‌లైన్ యాప్ లేదా ఎన్‌వీఎస్‌పీ పోర్టల్ ద్వారా ఇంట్లోనే ఉండి సులభంగా ఫారం-6 సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవచ్చని వివరించారు. అన్ని విద్యా సంస్థల్లో ప్రత్యేక ఓటు నమోదు డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో ఓటు హక్కు నమోదుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న జేసీ కల్పనాకుమారి

మహారాజశ్రీ శ్రీయుత అడిషినల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో: ఒంగోలు

E.P. No. 68/2025 In O.S.No.60/2019

షేక్ మస్తాన్‌బీ మరియు ఇతరులు ... D.H.Rs

Vs

షేక్ కాలేషావలి ... J.D.R

వేలం ప్రకటన

పై నెంబరు దావా నందలి డిక్రీ బాకీ వసూలు నిమిత్తమై J.D.R కి సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిని వేలం వేయుట ద్వారా డిక్రీ బాకీ వసూలు కొరకు D.H.Rలు పై నెంబరు E.P ని దాఖలు చేయటమైనది. J.D.R కి చెందిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిని అనగా పై నెంబరు E.P. నందలి షెడ్యూలు దాఖలా ఆస్థిని వేలం వేయుటకు తేది. 18-09-2026న ఉదయం గం॥ 10-30 నిమిషములకుగా సమయమును కోర్టు వారు నిర్ణయించినారు కనుక వేలంపాటలో పాల్గొనదలచిన వారు పై కోర్టు వారి ఎదుట తేది. 18-09-2026న ఉదయం గం 10-30 నిమిషములకు హాజరు అయి కోర్టు వారు నిర్ణయించిన నిబంధనలకు లోబడి కోర్టు వారు జరిపే వేలం పాటలో పాల్గొనగలరని తెలియపరచటమైనది.

షెడ్యూలు:- ప్రకాశం జిల్లా - ఒంగోలు సబ్॥రి॥యిలాకా - ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా- ఒంగోలు నగరం - గోపాలనగరం- 4వలైను - 1వబ్లాకు - టౌను సర్వేనెం. 8/3 పాత డోరు నెం. 40-15-7 - ప్రస్తుత డోరు నెం. 40-15-6(1)-11 గదుల విస్తీర్ణం గల ఆస్థిలో 7 గదుల విస్తీర్ణం గల ఆర్.సి.సి. బిల్డింగు మరియు 1 గది విస్తీర్ణం గల ఎ.సి.సి. రేకుల షెడ్డుతో కూడిన ఆస్తికి హద్దులు. **తూర్పు:** ఉప్పలపాటి వెంకటేశ్వర్లు గారి గోడ. **పడమర:** మున్సిపల్ బజారు. **ఉత్తరం:** మస్తాన్‌వలి మరియు నజీర్ల గారి ఆస్థి. **దక్షిణం:** షేక్ నాగూర్ గారి ఆస్థి.

వేలం తేది: 18-09-2026
హియరింగు తేది: 25-09-2026

D.H.Rs విలువ: రూ. 15,00,000/-
అమీనా విలువ: రూ. 20,00,000/-
మార్కెట్ విలువ: రూ. 25,64,240/-

//కోర్టు వారి అనుమతితో//

ఇట్లు/- **పి.వి.శ్రీనివాస గుప్తా**
కె.ఆర్.తిమోతిపాల్
న్యాయవాదులు, ఒంగోలు.

స్థలం: ఒంగోలు
తేది: 31-08-2026